# మరోసారి స్టడీ టూర్‌కు 'కార్పొరేటర్లు'

**-అహ్మదాబాద్, చండీఘర్ వెళ్లేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం**
**-టూర్ కొరకు 1కోటి 40లక్షల ఖర్చు చేయనున్న జిహెచ్ఎంసి**
**-సభ్యుల పదవికాలం ఇంకా 42రోజులే ఉండటంతో సర్వత్రా విమర్శ**
**-గతంలో వెళ్ళొచ్చి ఏమి చేశారన్న ఆరోపణలు**




**హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు మరోసారి స్టడీ టూర్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పదవీకాలం ముగింపు దశకు చేరుకున్న టైమ్‌లో కార్పొరేటర్ల స్టడీ టూర్ చర్చకు దారి తీస్తుంది. మరో 42 రోజులు మాత్రమే పదవీ కాలం ఉండగా ఇప్పుడు వీళ్లు వెళ్లి స్టడీ చేసి, రిపోర్ట్ తయారు చేసి, జీహెచ్ఎంసీ లో అమలు చేసేది ఎప్పుడూ అని ప్రశ్నిస్తున్నారు. జీహెచ్ఎంసీలో మొత్తం 150 కార్పొరేటర్లు ఉండగా ఇందులో ముగ్గురు చనిపోగా, ఇద్దరు ఎమ్మెల్యేలు గా గెలిచారు. దీంతో ప్రస్తుతమున్న 145 కార్పొరేటర్లను అహ్మదాబాద్, చండీగఢ్ నగరాలకు కార్పొరేటర్లను తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు 1.40 లక్షల రూపాయలు ఖర్చు చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఆధునిక పట్టణ పాలన, మౌలిక వసతులు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు ఈ పర్యటన నిర్వహించనున్నట్లు కార్పొరేటర్లు చెబుతున్నాపదవీ కాలం మరో నెల పదిరోజులు మాత్రమే ఉన్న సమయంలో వెళ్లి అధ్యయనం చేయాల్సిన అవసరమే ముందనే ప్రశ్నలు వస్తున్నాయి. గతేడాది కార్పొరేటర్లు అస్సాం, ఇండోర్ నగరాలకు స్టడీ టూర్‌గా వెళ్లారు. ఆ పర్యటనపై అప్పట్లో వ్యయ భారంపై విమర్శలు వచ్చినప్పటికీ, మరోసారి భారీ స్థాయిలో టూర్ ప్లాన్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. ఈసారి 1కోటి 40 లక్షల రూపాయలతో ప్రయాణం, వసతి, భోజనం, లోకల్ ట్రాన్స్ పోర్ట్ వంటి ఖర్చులతో భారీ మొత్తాన్ని జిహెచ్ఎంసి భరించనుంది.

**ఒకొక్కరిపై సుమారు లక్ష ఖర్చు..**

స్టాండింగ్ కమిటీ సమావేశంలో స్టడీటూర్‌కు ఆమోదం తెలపడంతో త్వరలోనే టూర్ షెడ్యూల్ ను ఖరారు చేసే అవకాశముంది. అయితే పదవీకాలం చివరి దశలో ఇంత భారీ వ్యయంతో టూర్ అవసరమా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. దీంతో ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాల కోసమే పర్యటనలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎంఐఎం కార్పొరేటర్ మిర్జా ముస్తఫా బేగ్ కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు వెళ్లాలనుకుంటున్నారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ కార్యదర్శి కార్యాలయానికి లేఖ రాశారు. అహ్మదాబాద్, చండీగర్ కార్పొరేషన్లను సందర్శించాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రతిపాదనను కార్యదర్శి కార్యాలయం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముందు ఉంచింది. మేయర్ ఆమోదం అనంతరం ట్రావెల్ ఏజెన్సీల నుంచి కొటేషన్లు పిలిచారు. అహ్మదాబాద్ కు వెళ్లే కార్పొరేటర్ల కు ఒక్కొరికి 93,975 చండీఘర్ వెళ్లే కార్పొరేటర్లకు కు 94,132 ఖర్చవుతుందని ఏజెన్సీ ప్రతిపాదనలు సమర్పించింది. ఆయా వివరాలన్నింటినీ స్టాండింగ్ కమిటీ ముందు ప్రవేశపెట్టి సోమవారం ఆమోదించారు. అయితే చండీఘర్‌కి స్టడీ టూర్ కోసం వెళ్ళి, అక్కడినుంచి వందకిలోమీటర్ల దూరంలో ఉన్న మరో ప్రాంతానికి వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**అప్పుడు వెళ్ళొచ్చి ఏంచేశారు ..?**

గతేడాది ఆగస్టులో పాలకమండలి సభ్యులు ఇండోర్, అస్సాం టూర్‌కు వెళ్లారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి నేతృత్వంలో రెండు బృందాలుగా యాత్రలు జరిగాయి. ఒక్కో కార్పొరేటర్‌కు 80 వేల చొప్పున కోటి 16 లక్షలు ఖర్చు చేశారు. అయితే ఆపర్యటనల్లో ఏంనేర్చుకున్నారు...ఏం నివేదిక ఇచ్చారు..ఏం అమలు చేశారు అనేది మాత్రం ఎవరికి తెలియదు. అధ్యయన యాత్రకు సంబంధించి కనీసం నివేదిక సైతం సమర్పించలేదు. దీంతో గత అధ్యయన యాత్ర విహార యాత్రలాజరిగిందన్న విమర్శలు వచ్చాయి. పైగా కార్పొరేటర్ల పర్యటనలపై లోకాయుక్త సైతం అభ్యంతరం తెలిపింది. ప్రజాధనం వృధా తప్ప ప్రయోజనం లేదని పేర్కొంది. అయినప్పటికి కార్పొరేటర్లు మరోసారి అధ్యయన యాత్రకు వెళ్తుండడం విమర్శలకు తావిస్తోంది.

హైదరాబాద్ వార్త



# 'ఉత్తర' దర్శనానికి వేళాయే..!

## - ముస్తాబైన ప్రధాన ఆలయాలు


టిటిడి దేవాలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు.


పురాతనమైన చౌక్ మైదాన్ ఖాన్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వేంకటేశ్వర స్వామి వారి చిత్రం


చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆలయం ఈఓ రామాంజనేయులు

హైదరాబాద్ డిసెంబరు 29, ప్రభాతవార్తః వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో నగరంలోని ప్రధాన ఆలయాలు భక్తుల దర్శనార్థం సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఉత్తర ద్వార దర్శనానికి ఆలయ అధికారులు ఇప్పటికే విస్తృత ఏర్పాట్లను చేశారు.. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. పూల అలంకరణలతో, విద్యుత్ దీపాల వెలుగులతో ఆలయాలు సర్వాంగ సుందరంగా, శోభాయమానంగా స్వాగతం పలుకుతున్నాయి.. ఉత్తర ద్వార దర్శనాన్ని అత్యంత పవిత్రంగా భావించే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే నేపథ్యంలో ఇప్పటికే ఆలయాల వద్ద పోలీసులు, జీహెచ్ఎంసీ, విద్యుత్‌శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# రెండు రోజులు, ఇద్దరు డిసిలు బాధ్యతలు స్వీకరణ

**-బదిలీ అయిన మరొకరు సస్పెండ్ -హాట్ టాపిక్‌గా మారిన అల్వాల్ డిసిల బదలీలు**


ఒక రోజు డిసి తిప్పర్తి యాదయ్య


నేటి డిసి భోగేశ్వర్

**అల్వాల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** అల్వాల్ డిసిల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. రెండు రోజులులో ఇద్దరు బాధ్యతలు స్వీకరించడం, ఇక్కడి నుంచి బదిలీ చేసిన మరో డిసిని సస్పెండ్‌కు గురవడం చర్చాంశనీయంగా మారింది. జిహెచ్ఎంసి పరిధిలోని కమీషనర్ల బదిలీలను ఇటీవల చేపట్టడం జరిగింది. రెండున్న సంవత్సరాలు కాలంగా ఇక్కడ పని చేసిన శ్రీనివాస్ రెడ్డి కవాడిగూడ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తిప్పర్తి యాదయ్యను నియామకం జరగగా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉండగా యాదయ్య బదిలీని నిలిపి వేస్తూ భోగేశ్వర్‌ను డిసిగా నియమించడం గందరగోళ పరిస్థితికి దారి తీసింది. ఒక్క రోజులోనే డిసి మార్పుకు బలకమైన కారణంగా ఉంటుందనేది రాజకీయ వర్గాలులో చర్చ జరిగింది. తిప్పర్తి యాదయ్య గతంలో అల్వాల్ డిసిగా పని చేయగా వ్యక్తిగతమైన వ్యవహారంలో ఆయన బదిలీ వేటుకు గురయ్యారు. మరలా ఆయన డిసిగా నియమించడం కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రస్తుతం ఆయన ఒక్క రోజు డిసిగా పని చేయడం విశేషం. కవాడిగూడకు బదిలీ అయిన శ్రీనివాస్ రెడ్డి తనకు ఉన్న పలుకుబడితో అల్వాల్‌లోనే కొసాగాలనే పట్టుదలతో ప్రయత్నాలు చేశారనే ప్రచారం జోరుగా సాగింది. తెలంగాణా ప్రభుత్వ లా విభాగం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి సర్కిల్ డిసిగా పని చేయడం జరిగింది. సొంత విభాగానికి లేదా అల్వాల్‌లోనే ఉండే విధంగా గట్టి కృషి జరిగిందని తెలుస్తోంది. కమీషనర్ ఆదేశాలను తుంగలో తొక్కి కవాడిగుడాలో డిసిగా బాధ్యతలు స్వీకరించక పోవడంతో సస్పెండ్‌కు గురయ్యారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన భూ వివాదంలో ప్రధాన సూత్రదారుడిగా విజిలెన్స్ విచారణలో నిగ్గు తేలింది. ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయించారనేది ఆయనపై ఉన్న ప్రధాన అభియోగం. ప్రోటోకాల్ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం కూడా రాజకీయ వర్గాలులో ఆయనపై వ్యతిరేకత ఉంది. స్థానిక ఎమ్మెల్యేను పట్టించుకోక పోవడం ఆయన కార్యక్రమకాలకు ఎక్కడా హాజరయిన సందర్భాలు కూడా లేవు. రెండున్న సంవత్సరాలు వన్‌మ్యాన్ షోగా సర్కిల్‌ను నడిపించారు. శ్రీనివాస్ రెడ్డి బదిలీ విషయం బయటకి వచ్చిన రోజున కొంత మంది సర్కిల్ కార్యాలయం ఎదుట బాణాసంచా కాల్చి నృత్యాలు చేయడం బట్టి ఆయనపై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు. జిహెచ్ఎంసి కమీషనర్ విడుదల చేసిన డిసిల బదిలీలులో తిప్పర్తి యాదయ్యను అల్వాల్‌కు కేటాయంచడం జరిగింది. మరునాడు ఆయన సర్కిల్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఒక రోజు గడవక ముందే ఆయన బదిలీని నిలిపి వేస్తూ భోగేశ్వర్ నియామకం జరగడం విశేషం. రెండు రోజులు వ్యవధిలోనే యాదయ్యకు షాక్ తగిలినట్లుయ్యింది. సర్కిల్ డిసిగా పని చేసిన సమయంలోని ఆయనపై జరిగిన ప్రచారంకు సంబంధించి స్థానికులు కొందరు జిహెచ్ఎంసి కమీషనర్‌కు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఈ నేపధ్యంలోనే ఆయన బదిలీని నిలిపి వేసి గతంలో పని చేసిన స్థానానికే పరిమితం చేయడం జరిగింది. అధికారులు బదిలీలకు సంబంధించి రెండు మూడు రోజులుగా జరిగిన పరిణామాలు రాజకీయ పార్టీలు, ప్రజానీకంలో చర్చోప చర్చలకు దారి తీశాయనే చెప్పాలి.

# మహానగరానికి 'మెగా' బడ్జెట్ ..!

**-రూ.11,460 కోట్లకు స్టాండింగ్ కమిటీ ఆమోదం**
**-విలీన మున్సిపాలిటీలతో కలిపి బడ్జెట్ రూపకల్పన**
**-15అజెండా 7 ఇతర అంశాలకు ఒకే..**


స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మేయర్ విజయలక్ష్మి తదితరులు

**హైదరాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీహెచ్ఎంసీ బడ్జెట్ ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ అమోదం తెలపింది. ఈమేరకు సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది.దీనికి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తోపాటు స్టాండింగ్ కమిటీ సభ్యులు హాజరై 2026-27 ఆర్థిక సంవత్సరంకు గానూ వార్షిక డ్రాఫ్ట్ బడ్జెట్ ప్రతిపాదనలు, అలాగే 20252-26 ఆర్థిక సంవత్సరంకు గానూ సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం విలీన మున్సిపాలిటీలతో కలిపి సిద్ధం చేసిన రూ.11,460 కోట్ల వార్షిక బడ్జెట్ ఆమోదం తెలిపారు. ఇలా 15 ఎజెండా,7 అడిషనల్ అంశాలకు కమిటీ అమోదం తెలిపింది.మీటింగ్ ప్రారంభం కాగానే కమిషనర్ ఆర్.వి. కర్ణన్ బడ్జెట్ పై కమిటీ సభ్యులకు ప్రజెంటేషన్ ఇవ్వగా దానిపై విస్తృతంగా చర్చ జరిపిన సభ్యులు అనంతరం ఆమోద ముద్ర వేశారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం 2025-26నకు సంబంధించి రూ.10714.73 కోట్ల బడ్జెట్ తో పోల్చితే వచ్చే వార్షిక బడ్జెట్ రూ. 745.27 కోట్లు పెంచి రూ.11 వేల 460 కోట్లతో రూపొందించారు. జీహెచ్ఎంసీలో విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థల అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని ఈ బడ్జెట్ ముసాయిదాను రూపొందించారు.ఈసందర్భంగా స్టాండింగ్ కమిటీ అభిప్రాయాలను స్వీకరించిన అధికారులు వచ్చే నెల రెండో వారంలో బడ్జెట్ పై నిర్వహించనున్న స్పెషల్ కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.అనంతరం కౌన్సిల్‌లో చర్చ జరిగి, బడ్జెట్‌ను ఆమోదించిన తర్వాత ఆమోదం కోసం సర్కారుకు పంపనున్నారు.ఈసమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, మహ్మద్ సలీం, డా.ఆయేషా హుమేరా, మహాలక్ష్మి రామన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సి.ఎన్.రెడ్డి, మహమ్మద్ బాబా ఫసియుద్దీన్, వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప, అడిషనల్ కమిషనర్లు, జెడ్‌సిలు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో 31వ తేదీ అర్ధరాత్రి నిర్మాణ సామాగ్రి వాహనాలపై నిషేదం

**-మద్యం సేవించిన కస్టమర్లు డ్రైవింగ్ చేస్తే పబ్ యాజమాన్యం మీదా చర్యలు**
**-ట్రాఫిక్ ఉల్లంఘనలపై సైబరాబాద్ వ్యాప్తంగా ప్రత్యేక కెమెరాలు**

**గచ్చిబౌలి, డిసెంబరు 29 ప్రభాతవార్త** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి నిర్మాణ సామాగ్రిని తరలించే భారీ వాహనాల మీద నిషేదం విధిస్తూ సైబరాబాద్ కమీషనర్ అవినాష్ మహంతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి 10.30 గంటల నుంచి జనవరి 1వ తేదీ తెల్లవారుజామున 2 గంటల వరకు సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని ఔటర్ రింగురోడ్డు లోపల ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. దీంతో పాటు ఆటోరిక్షా, క్యాబ్ డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, కస్టమర్ల బుకింగ్ రైడ్‌ను నిరాకరించవద్దని సూచించారు. ఎవరైనా క్యాబ్ డ్రైవర్లు బుకింగ్ రైడ్‌ను నిరాకరిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల అర్ధరాత్రి కస్టమర్ల నుంచి ఎక్కువ డబ్బులు డిమాండ్ చేసినా చర్యలు తప్పవన్నారు. కమీషనరేట్ పరిధిలోని బార్,పబ్, క్లబ్‌లో మద్యం సేవించిన కస్టమర్లను వాహనాలు నడుపుతూ రోడ్డ మీదకు రాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత సదరు వ్యాపార సముదాయం నిర్వాహకులదేనని తేల్చిచెప్పారు. బార్,పబ్‌లలో మద్యం సేవించే కస్టమర్లను జాగృతం చేయాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేసే వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని సూచించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 31వ తేదీ అర్ధరాత్రి ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక ద ృష్టి కేంద్రీకరించామని, డేంజరస్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంప్, ర్యాష్ డ్రైవింగ్, కార్లపైన ఎక్కి ఇబ్బందులు స ృష్టించే వారిని అడ్డుకునేందుకు ప్రత్యేక కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబరాబాద్ పరిధిలో 31వ తేదీ రాత్రి 8 గంటల నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్ నిర్వహిస్తామని, కమీషనరేట్ పరిధిలో చెకింగ్ పాయింట్ల సంఖ్యను పెంచినట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని ఆపితే వెంటనే నిలిపివేయడంతో పాటు ధృవపత్రాలు చూపించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని, ట్రాఫిక్ డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఎక్కువ సౌండ్ పెట్టుకొని రోడ్లపై తిరుగుతూ న్యూసెన్స్ చేసే వాహనాల మీద సైతం చర్యలు తప్పవన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే వాహనాలను స్వాధీనం సీజ్ చేస్తామని, డ్రైవింగ్ లైసెన్సులు స్వాధీనం చేసుకొని మొదటిసారి దొరికిన వారికి 3 నెలల సస్పెండ్‌తో పాటు ఛలానా, రెండవ సారి అంతకం టే ఎక్కువ సార్లు దొరికిన వారికి డ్రైవింగ్ లైసెన్సును పూర్తిగా రద్దు చేస్తామని హెచ్చరించారు. కమీషనరేట్ పరిధిలో ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## చైనా మాంజా సమాచారం ఇస్తే రూ.5 వేల నజరానా

**-ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**


మీడియాతో మాట్లాడుతున్న దానం నాగేందర్

**జూబ్లీహిల్స్, డిసెంబరు 29, ప్రభాతవార్తః** ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎవరైనా చైనా మాంజా విక్రయించినట్లు తమకు సమాచారం ఇస్తే వారికి 5000 రూపాయల నజరానా అందిస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన ప్రకటన చేశారు. తాజాగా చైనా మాంజా కారణంగా నగరంలో పలు సంఘటనల్లో మృత్యువాత పడిన విషయం విధితమే. ఈ నేపథ్యంలోనే దానం నాగేందర్ సోమవారం బంజర హిల్స్‌లోని తన నివాసం వద్ద మాట్లాడుతూ.. పతంగులు ఎగరేసేందుకు చైనా మాంజాను ఎవరు ఉపయోగించవద్దని సూచించారు. చైనా మాంజా ప్రాణాలను హరిస్తుందని నియోజకవర్గంలో అలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు . పోలీసులు దృష్టి సారించి చైనా మజా విక్రయించే వారిపై దాడులు చేయాలన్నారు.

## కొడుకు ఇంటికి శుభకార్యానికి వచ్చి అనంతలోకాలకు...

**-లిఫ్టు గుంతలో పడి మహిళ మృతి**

**అత్తాపూర్ డిసెంబర్ 29,ప్రభాతవార్త :** శుభకార్యానికి వచ్చిన తల్లి లిఫ్టు గుంతలో పడి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం... సన్ సిటీ సమీపంలో మూన్ రాక్ అపార్ట్మెంట్ లో నివాసం ఉంటున్నా కొడుకు దగ్గరికి శుభకార్యానికి వచ్చిన తల్లిదండ్రులు లక్ష్మమ్మ ,లింగయ్యలు శుభకార్యం కార్యక్రమం ముగించుకొని తిరిగి శామీర్‌పేట్‌లోని వారి నివాసానికి వెళ్తున్న సమయంలో అపార్ట్‌మెంట్‌లో ఉన్న లిఫ్టు వద్దకు వచ్చారు.ఈ క్రమంలో లిఫ్ట్ డోర్ ఓపెన్ ఉందనుకొని లక్ష్మమ్మ(60) అందులో కాలు పెట్టేసరికి ఒక్కసారిగా లిఫ్ట్ కిందపడి మృతి చెందింది. భర్త లింగయ్య కేకలు వేయడంతో అపార్ట్‌మెంట్ వాసులు వచ్చి లక్ష్మమ్మని ఓ హాస్పిటల్ కి తరలించాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ముగిసిన 38వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

**-లక్షలాది మందితో సరికొత్త రికార్డు సృష్టించిన అక్షర జాతర**



బుక్‌ఫెయిర్ ముగింపు సభలో పాల్గొన్న ప్రముఖులు

**ముషీరాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** పదకొండు రోజుల పాటు ఎన్టీఆర్ స్టేడియంలో సందడిగా కొనసాగిన 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సోమవారం ముగిసింది. లక్షలాది మందితో రికార్డు స్థాయి సందర్శకులతో ఈనెల 19 నుంచి 29 వరకు కోలాహలంగా బాలోత్సవం, పుస్తకావిష్కరణలు, చర్చాగోష్టిలతో అలరించిన అక్షర జాతర ముగింపు వేడుకలు సోమవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ముగింపు వేడుకల సభ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు కవి యాకుబ్ అధ్యక్షతన జరగగా, కార్యదర్శి వాసు అతిధులను ఆహ్వానించారు. ముఖ్య అతిధిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, గౌరవ అతిధిగా తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి, ఆత్మీయ అతిధిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ పాత్రికేయులు కే.రామచంద్రమూర్తి, రమా మెల్కోటె తదితరులు పాల్గొన్నారు.

**రాజ్యాంగం అందరికీ అందాలి: జస్టిస్ సుదర్శన్‌రెడ్డి**

భారత రాజ్యాంగాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా తెలుగులో పాకెట్ సైజులో ప్రతిగా ముద్రించి, అతి తక్కువ ధరకు వచ్చే ఏడాది అందుబాటులోకి తేవాలని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి బుక్‌ఫెయిర్ నిర్వాహకులకు సూచించారు.భావప్రకటనా స్వేచ్ఛకు ఈ వేదిక అద్దం పడుతోందని,గాంధేయవాదులకే కాకుండా గాంధీని విమర్శించే వారికి కూడా ఇక్కడ పుస్తకాలు అం దుబాటులో ఉండటం శుభపరిణామమని కొనియాడారు. వేదికలపై మహిళా ప్రాతినిధ్యం పెరగాల ని,సమానత్వం గురించి కేవలం మాటల్లోనే కాకుండా, ఆచరణలో సైతం చూపించాలని హితవు పలికారు.

**పుస్తక పఠనంలో ప్రపంచ అగ్రగామిగా ఎదగాలి : ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి**

ఆర్థిక రంగంలో కన్నా పుస్తక పఠనంలోనే మనం ప్రపంచ అగ్రగామిగా ఎదగాలని కే.శ్రీనివాస రెడ్డి ఆకాంక్షించారు. వ్యవసాయ, పశుసంవర్ధక పరిశోధనలు రైతులకు అందుబాటులోకి తేవాలని, పుస్తక విరాళాల కార్యక్రమం ఒక గొప్ప సామాజిక ఆశయమని కొనియాడారు.

**మద్యం, గంజాయి వ్యసనాలను వీడి, పుస్తక పఠనాన్ని వ్యసనంగా మలచుకోవాలి: ప్రొఫెసర్ కోదండరాం**

యువత మద్యం, గంజాయి వంటి వ్యసనాలను వీడనాడి, పుస్తక పఠనాన్ని వ్యసనంగా మార్చుకోవాలని ప్రొఫెసర్ కోదండరాం సూచించారు. తలవంచుకుని పుస్తకం చదివితే, సమాజంలో తలెత్తుకుని జీవించే శక్తి లభిస్తుందని అన్నారు.

**బుక్‌ఫెయిర్‌ను సందర్శించిన హైడ్రా కమీషనర్ రంగనాథ్:** బుక్‌ఫెయిర్‌ను సోమవారం సాయంత్రం హైడ్రా కమీషనర్ రంగనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు పుస్తకాల స్టాల్స్‌ను ఆసక్తిగా పరిశీలించారు. లక్షలాది మంది సందర్శకులతో ఎంతో ప్రతిష్టాత్మకంగా బుక్‌ఫెయిర్‌ను నిర్వహించటం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

కార్యదర్శి వాసు వార్షిక నివేదికను సమర్పిస్తూ గతేడాది 12 లక్షల మంది సందర్శకులు బుక్‌ఫెయిర్‌ను సందర్శించగా, ఈ సంవత్సరం 16 లక్షల మంది సందర్శించారని ఆనందం వ్యక్తం చేశారు. బుక్‌ఫెయిర్ ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో విజయవాడలో పుస్తక ప్రదర్శన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇక్కడ పొడిగించలేకపోతున్నామని తెలిపారు.

# మితిమీరిన వీధి కుక్కల బెడద

**-చిన్నారిపై వీధి కుక్కల దాడి..తీవ్ర గాయాలు**
**-ఘటనలు జరిగినప్పుడే అధికారుల హడావిడి**
**-ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు : ఫిర్యాదుదారులు**


దాడి చేసిన కుక్కను పట్టుకున్న అధికారులు


దాడిలో గాయపడిన చిన్నారి

**అత్తాపూర్ డిసెంబర్ 29,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ ,అత్తాపూర్ పరిధిలోని పలు ప్రాంతాలలో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులు,గుంపులుగా స్వైరవిహారం చేస్తూ చిన్నా, పెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించు కోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో రోడ్లపైకి చిన్నారులను పంపించాలంటేనే ప్రజలు భయాభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఆయా జిహెచ్ఎంసి పరిధిలో కుక్కలను బంధించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడం లాంటివి చేసే వారు. ప్రస్తుతం ఆ తరహ చర్యలు కనిపించడం లేదు. కుక్కలను చంపకుండా వాటి సంతతిని పెరగకుండా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిని సైతం ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవు. ఈ సంవత్సరంలో చిన్నారులపై విధి కుక్కలు దాడులు చేసిన ఘటనలు పలు చోట్ల చోటుచేసున్నాయి.అయితే దాడి జరిగిన ప్పుడే హడావిడి చేస్తూ తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు వాపో తున్నారు. తాజాగా అత్తాపూర్ పరిధిలో ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయ పర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం వాసుదేవ రెడ్డి కాలనీలో చిన్నారి నిత్యశ్రీ(3) ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా విధి కుక్క దాడి చేయడం తో పాప ముఖం మీద తీవ్ర గాయాలు అయ్యా యి.ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.అయితే చిన్నారికి దాదాపు 18 కుట్లు పడినట్లు వైద్యులు పేర్కొన్నారు.

**ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదు**

జిహెచ్ఎంసిలో అధికారులకు ,ఆన్‌లైన్‌లో గతంలో వాసుదేవ రెడ్డి నగర్ కాలనీ ,అత్తాపూర్ కాలనీవాసులంతా ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. ఘటనలు జరిగినప్పుడే హడావిడి చేస్తూ కుక్కలు బందిస్తున్నారని ఆ తరువారు పట్టించోవడం లేదన్నారు.అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మరిన్ని ఘటనలు జరగకముందే చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత



వెంగళ్‌రావునగర్‌లో ఇంకుడు గుంతలో పేరుకుపోయిన చెత్తను తీసి వేసి శుభ్రపరుస్తున్న పాఠశాల విద్యాశాఖ(సమగ్ర శిక్షణ) డైరెక్టర్ రాధా రవిశేఖర్‌రెడ్డి దంపతులు.

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యవంతంగా జీవించటం కోసం తమ వంతు బాధ్యతగా తామే శుభ్రపర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ(సమగ్ర శిక్షణ) డైరెక్టర్ రాధా రవిశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయమే నిద్రలేవగానే తమ వంతుగా రాధా రవిశేఖర్‌రెడ్డి దంపతులు తమ ఇంటి పరిసరాలను తామే స్వయంగా పరిసరాలను శుభ్రపరిచి ఇంటి ముందు ఉన్న ఇంకుడు గుంతలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తీసి వేసి శుభ్రపరిచారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రతపై తగిన జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని అదేవిధంగా చెత్తను కాలువల్లో, రోడ్లపై వేయకుండా చెత్త కుండీలలోనే వేసి పారిశుధ్యాన్ని పాటించాలన్నారు. ఈ విషయంపై పాఠశాలలో కూడా ఉపన్యాసాలు, వ్యాసాలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించటం వలన పారిశుధ్య నిర్వహణ బాధ్యత తెలుస్తుందన్నారు.

## ఘనంగా ముగిసిన కేజీఎన్ దర్గా ఉత్సవాలు



కేజీఎన్‌నగర్‌లో దర్గా ఉర్సు ఉత్సవాల్లో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** కాజా గరీబ్ నవాజ్ దర్గా ఉర్సు ఉత్సవాలు హిందూ ముస్లీంల ఐక్యతకు నిదర్శనమని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేజీఎన్‌నగర్‌లో దర్గా ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతి ఒక్కరు కుల మతాలకు అతీతంగా ఈ ఉత్సవాల్లో పాల్గొని ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. అనంతరం కేజీఎన్ దర్గా ఉత్సవ కమిటీ అధ్యక్షులు మోయిన్ పటేల్ మాట్లాడుతూ సుమారు మూడు దశాబ్దాల క్రితం ఏర్పడిన ఈ దర్గాలో ఉత్సవాలను ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, చాంద్ పాషా, జుబేర్, మహ్మద్, నూర్‌ఖాన్, కబీర్ పాల్గొన్నారు.

## చింతల్ మున్సిపల్ సర్కిల్ ఉపకమిషనర్‌గా లావణ్య



**కుత్బుల్లాపూర్, డిసెంబరు 29 ప్రభాతవార్త** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చింతల్ సర్కిల్-54 డిప్యుటీ కమిషనర్‌గా లావణ్య పదవీబాధ్యతలు చేపట్టారు. గతంలో జిహెచ్‌ఎంసి పన్నుల విభాగంలోనూ, టోలీచౌకీ సర్కిల్ ఉపకమిషనర్‌గా విధులు నిర్వహించడంతోపాటు జిహెచ్ ఎంసి లోని వివిధ విభాగాలలో పనిచేసిన లావణ్య నూతనంగా ఏర్పడ్డ చింతల్ సర్కిల్ నూతన డిప్యుటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. గ్రేటర్‌హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పడ్డ చింతల్ సర్కిల్ మొదటి ఉపకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన లావణ్య మాట్లాడుతూ చింతల్ సర్కిల్ పరిధిలోకి వచ్చే రుడామిస్త్రినగర్, జగద్గిరిగుట్ట, రంగారెడ్డినగర్, చింతల్, గిరినగర్ డివిజన్లను త్వరలోనే పర్యటించనున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం, పన్నులవసూళ్లపై ప్రత్యేకదృష్టి సారించనున్నట్లు తెలిపారు. కొత్తగా మున్సిపల్ సర్కిల్ ఏర్పడినందున అన్నివిభాగాలు ఒక్కతాటిపైకి వచ్చేందుకు కొద్దిసమయం పడుతుందని ప్రజలు ఎలాంటి ఫిర్యాదులపైనా తనదృష్టికి తీసుకువస్తే వాటిపరిష్కారానికి చర్యలు చేపడతానని హామీఇచ్చారు.

## దళితులకు ఎనిమిది స్థానాలను కేటాయించాలి



కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలో దళితులకు ఎనిమిది స్థానాలు కేటాయించాలని ఆందోళన నిర్వహిస్తున్న జిహెచ్‌ఎంసి దళిత రిజర్వేషన్ సాధన జెఏసి నేతలు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 29 ప్రభాతవార్త** నూతనంగా ఏర్పడ్డ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ జోనల్ పరిదిలో ఎనిమిది స్థానాలను ఎస్‌సిలకు కేటాయించి జనాభా ప్రాతిపదికన గుర్తించి న్యాయం చేయాలని దళిత రిజర్వేషన్ సాధన జెఏసి సంఘాల నేతలు ఆందోళన నిర్వహించారు. సోమవారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించాలని డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా మహా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముత్యపాగ నర్సింగ్‌రావు, కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కుమ్మరి కిషన్‌రావు, ఎస్‌సిఆర్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు అవిజె జేమ్స్, గట్టుఅశోక్, హనుమకొండ ప్రేమ్‌కుమార్, ఎం.నర్సింగ్‌రావు, నాని, రమ్య జలాల, బి.అశోక్, దాసరి నర్సింహ్మాలతోపాటు పలు దళితసంఘాల ఆధ్వర్యంలో జీడిమెట్ల సర్కిల్ ఉపకమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మాకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గాజులరామారం సర్కిల్ పరిధిలో దళితులకు ప్రత్యేక స్థానాలను కేటాయించలేదని ప్రస్తుత పునర్‌విభజనలో 30డివిజన్లలో సుమారు ఎనిమిది డివిజన్లను జనాభా దామాషా ప్రకారం దళితులకు కేటాయించాలని డిమాండ్‌చేశారు.

## పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న హిదయా గ్రూప్ ప్రతినిధులు

**చార్మినార్,డిసెంబరు 29 ప్రభాతవార్త :** పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచి క్రమశిక్షణ,పట్టుదలతో చదివితే తప్పకుండ విజయం సాధిస్తారని డాక్టర్.ఔసాఫ్ సయూద్ (ఐఎఫ్ఎస్) అన్నారు.పిఎస్ఏ ఆధ్వర్యంలో పాతబస్తీలోని హిదాయా డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షలపై నిర్వహించిన యుపిఎస్‌సి అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు.అబ్దుల్ ఖదీర్ పలు పోటీ పరీక్షలు గురించి ఒక సమగ్ర ప్రదర్శన అందించారు.ఈ కార్యక్రమంలో కరీం ఇర్ఫాన్,ప్రొఫెసర్ డాక్టర్.ఎం.ఎం.అన్వర్,మేనేజింగ్ డైరెక్టర్ జుబేర్,ఛైర్మన్ రియాజుద్దీన్,బషీర్ అహ్మద్,సిర్మాన్ హిదాయ గ్రూప్ మహ్మద్ రియాజ్ ఉద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎగ్జిబిషన్ సొసైటీ స్టాల్స్ ఎంపిక పారదర్శకంగా చేయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న టీజేఎస్ గ్రేటర్ అధ్యక్షులు ఎం.నర్సయ్య

**సైఫాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** ఎగ్జిబిషన్ సొసైటీ స్టాల్స్ ఎంపిక పారదర్శకంగా చేయాలని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో అసోసియేషన్ నేతలు సయ్యద్ అబ్రర్ అలీ, రాంచందర్, గాంధీదర్శన్ కార్యదర్శి ప్రొఫెసర్ జి. ప్రసాద్, తెలంగాణ జనసమితి గ్రేటర్ అధ్యక్షులు ఎం.నర్సయ్య, మహ్మద్ అఫ్జల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగ్జిబిషన్ సొసైటీ స్టాల్స్ ఎంపిక అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టాల్స్ ఎంపికలో స్థానికులకు అవకాశం ఇవ్వాలని, సొసైటీకి వచ్చే నిధులు, ఖర్చుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. జీహెచ్ఎంసీ, విద్యుత్ అనుమతులు లేకుండా ఎగ్జిబిషన్ ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. 1969లో నిర్మాణం చేసిన గాంధీ దర్శన్‌ను కూల్చి వేశారని, అక్కడ ఉన్న సామాగ్రిని బయట పడేసి, దానిపై వచ్చే ఆదాయానికి గండి కొట్టారని ఆరోపించారు. 3,500 స్టాల్స్ ఉండగా కేవలం 2000 స్టాల్స్ మాత్రమే ఉన్నట్లు ప్రభుత్వానికి చూపుతున్నారని, ఒక్కో స్టాల్ నుంచి రెండు లక్షలు, మూడు లక్షలు, తొమ్మిది లక్షలు కూడా వసూలు చేస్తూ ప్రభుత్వానికి మాత్రం కేవలం లక్ష రూపాయలే వసూలు చేస్తున్నట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. నర్సయ్య మాట్లాడుతూ స్టాల్ హోల్డర్స్ చేస్తున్న న్యాయపోరాటానికి తెలంగాణ జనసమితి పూర్తిగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. స్టాల్స్ బాధితులకు న్యాయం జరిగేవరకు వారి పక్షాన ఉండి పోరాడతామని హామీ ఇచ్చారు. ఎగ్జిబిషన్ ఆదాయ వ్యయాలను సొసైటీ బహిర్గతం చేయాలని, అవకతవకలపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలనో స్టాల్స్ బాధితులు, టీజేఎస్ నేతలు పాల్గొన్నారు.

## శిలాఫలకాలకే పరిమితమైన ప్రగతి : మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి



వేముకుంట బస్తీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి

**శేరిలింగంపల్లి,డిసెంబర్ 29పభాతవార్త** ఎన్నికల వాగ్ధానాలు కేవలం శిలాఫలకాలకే పరిమితం చేస్తున్నారే కాని అభివృద్దిపనులు ముందుకు సాగటంలేదని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నేత, చందానగర్ మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి ఆరోపించారు. చందానగర్ డివిజన్‌లోని వేముకుంటబస్తీ,సత్య ఎన్‌క్లేవ్ కాలనీల్లో సోమవారం మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి పర్యటించారు. బస్తీ వాసుల ఫిర్యాదు మేరకు ఏడాది క్రితం ఏర్పాటు చేసిన శిలాపలకాలాను ఆమె పరిశీలించారు. ఏడాది క్రితం వేసిన శిలాఫలకంలో అభివృద్ది పనులు ఇంత వరకు పూర్తికాకపోవడంపై అధికారులకు ఫోన్ చేసి వివరణ కోరటంతో వారం రోజుల్లో పనులు పూర్తిచేస్తామని అధికారులు బదులివ్వడంపై మాజీ కార్పొరేటర్ స్పందించారు. వేముకుంట బస్తీ,సత్యఎన్‌క్లేవ్ కాలనీలో దాదాపు కోటి రూపాయలతో అభివృద్ది పనులకు శిలాఫలకం ఏర్పాటు చేవారని, సుమారు ఏడాది పూర్తికావస్తున్నా నిదులు లేకపోవడంతో పనులు ప్రారంభించలేదన్నారు.పాత పనులే పూర్తికాకపోవడంతో కొత్త పనులకు నిధులు ఎక్కడివని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యే గాంధీ ఎన్నికల నేపద్యంలో అలవికాని హామీలను గుప్పించి శిలాఫలకాలను వేశారన్నారు. ఎన్నికల ముందు అభివృద్ది చేశామంటూ శిలాఫలకాలను చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని వాపోయారు. నిధులు లేకుండానే అధికారుల అనుమతులు లేకుండానే అడ్డగోలుగా శిలాఫలకాలను ఏర్పాటు చేసి ఓట్లకోసం ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. నియోజక వర్గంలో వంద కోట్లకు పైగా నిధులకు సంబందించి శిలాఫలకాలు ఉన్నాయని, పనులు మాత్రం మొదలు కాలేదన్నారు. అలంకార ప్రాయంగా మారిన శిలాఫలకాల గురించి అధికారులను ప్రశ్నిస్తే తమకు ఏలాంటి సంబంధం లేదని అధికారులు చేతులేత్తేస్తున్నారని ఆమె విమర్శించారు. ఎన్నికల వాగ్ధానాలను నెరవేర్చటంతో పాటు ప్రస్తుతం ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై పేర్కొన్న అభివృద్దిని చేసి చూపాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో కూడా బస్తీల వాసులతో రోడ్డుపై భైఠాయించి నిరసనలకు దిగుతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సలీం ,గౌస్,కృష్ణమూర్తి,రాఘవరావు, విజయ్, సత్యనారాయణ, మెయినుద్దీన్, జహంజర్,ఖలీల్, అలీం,రౌఫ్, అబ్దుల్ హైమద్, మోసిన్, మల్లేశ్,ఉపేందర్,అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాలలో ఉద్యోగ నోటిఫికేషన్‌పై చర్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిరుద్యోగ హక్కుల వేదిక అధ్యక్షులు అశోక్

**-నిరుద్యోగ హక్కుల వేదిక అధ్యక్షులు అశోక్**

**సైఫాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** అసెంబ్లీ సమావేశాలలో ఉద్యోగ నోటిఫికేషన్‌పై చర్చించాలని నిరుద్యోగ హక్కుల వేదిక అధ్యక్షులు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏడాది లోగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ హామీ ఇచ్చిందని, ఉద్యోగాలు వస్తాయనే ఆశతో నిరుద్యోగులంతా కాంగ్రెస్‌ను గెలిపిస్తే, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా రెండు ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలలో కృష్ణ, గోదావరి జలాలపై చర్చిస్తున్న పార్టీలు అంతే ప్రాధాన్యత ఉన్న నిరుద్యోగుల గురించి కూడా చర్చించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి వంటి ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసి, వారి ఆత్మహత్యలకు కారణమవుతోందని ధ్వజమెత్తారు. గతంలో నిరుద్యోగుల పక్షాన పోరాడే కోదండరాం, రియాజ్ వంటి వారికి పదవులు వచ్చేసరికి పెదవులు మూసుకుపోయాయని, వారు కూడా నిరుద్యోగులను పట్టించుకోవటం లేదని విమర్శించారు. తక్షణమే అసెంబ్లీ సమావేశాలలో నిరుద్యోగుల అంశంపై చర్చించి, నోటిఫికేషన్లు జారీ చేయాలని, లేనిపక్షం సంక్రాంతి తరువాత ముఖ్యమంత్రికి చావుడప్పు మోగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ నేతలు రవికుమార్, బాలకోటి, వేణునాయక్, శంకర్‌నాయక్, కయ్యా వెంకటేష్ పాల్గొన్నారు.

# విలువలతో కూడిన రాజకీయం చేసిన గొప్ప వ్యక్తి వాజ్ పేయి



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

**-రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్**

**చిక్కడపల్లి డిసెంబర్ 24,ప్రభాతవార్త :** విలువలతో కూడిన రాజకీయం చేసిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్ పేయి అని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సోమవారం అడిక్‌మెట్ డివిజన్ సత్యనగర్ కమ్యూనిటీ హాల్ లో భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బిజెపి అడిక్మెట్ డివిజన్ అధ్యక్షులు పాశం సాయికృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కే లక్ష్మణ్ , బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్ హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. ఒక్క ఓటుతో ప్రభుత్వం పడిపోతున్నా కూడా ఎటువంటి ప్రయత్నాలు చేయకుండా సంకీర్ణ ప్రభుత్వాన్ని నేను నడపలేను ప్రజా అభివృద్ధి చేయలేనని తేల్చి చెప్పి పార్లమెంటు నుండి నేరుగా ప్రజల్లోకి వెళ్లిన గొప్ప వ్యక్తి అటల్ బిహారి వాజ్ పేయి అని కొనియాడారు. కేంద్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చి ప్రధానిగా వాజ్ పేయి అనేక సంస్కరణలు చేపట్టారని తెలిపారు. ప్రపంచ దేశాలకు తెలియకుండా పోక్రాన్ లో అణు పరీక్షలు విజయవంతంగా చేసి ప్రపంచానికి భారత సత్త చాటారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ యువనేత కోవా రాహుల్, రమేష్ రామ్, రొయ్యూరు శేషసాయి పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ పోస్టులు, పదోన్నతులు ఇవ్వాలి : సామ అమృత్ రెడ్డి

**అత్తాపూర్ డిసెంబర్ 29,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు వ్యవసాయ కళాశాలలకు పరిపాలనాధికారులు (ఏఒ)లను నియమించాలని తెలంగాణ యూనివర్శిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయి స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ సామ అమృత్ రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి నూతనంగా కొడంగల్, నల్గొండ, నిజామాబాద్ జిల్లాలకు మూడు వ్యవసాయ కళాశాల లను మంజూరు చేసిందన్నారు. ఆ కళాశాలకు టీచింగ్ స్టాప్ లో ముగ్గురు అసోసియేట్ డీన్‌లను నియమించి కళాశాలలను కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఒక్కొక్క కళాశాలకు నలభై మంది అధ్యాపకులు, 13 మంది బోధనేతర సిబ్బందిని నియమించుకోవచ్చని సూచించిందన్నారు. టీచింగ్ స్టాఫ్ ను నియమించుకున్న వర్శిటీ యాజమాన్యం నాన్ టీచిం గ్ స్టాఫ్ ను మాత్రం నియమించలేదన్నారు. ఆ వ్యవసా య కళాశాలలకు ముగ్గురు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఒ)ల ను వెంటనే నియమించాలన్నారు. వారి ద్వారానే బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు, ఆర్థిక పరమైన లావాదే వీలు జరుగాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండ అసోసి యేట్ డీన్ లకే నిధులు డ్రా చేసుకునే అధికారాలు ఇచ్చి నాన్ టీచింగ్ పోస్టు పనులు కూడా వారి చేతనే చేయిస్తు న్నారన్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది పై ఎందుకంత చిన్న చూపు చూస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. డిసెంబరు 31 నాటికి డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ని ప్రకటించి అర్హత ఉన్న నాన్ టీచింగ్ సిబ్బం దికి నియామకాలు ఇవ్వాల్సి ఉంటుందని, అయితే ఇప్పటి వరకు డీపీసీ ని ప్రకటించకపోవడం బాధాకర మన్నారు.విశ్వవిద్యాలయంలో నాలుగు పోస్టులు ఖాళీగా ఉండగా ఐదుగురు అర్హులైన సిబ్బంది ఉన్నారన్నారు. వాటిలో మూడు వ్యవసాయ కళాశాల లలో ఏఒ పోస్టులు, వర్సిటీ పరిపాలన కార్యాలయంలో ఒక అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. వెంటనే డీపీసీ ని ఏర్పాటు చేసిన ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

## డ్రగ్స్ విక్రయించడానికి యత్నించిన యువకుని అరెస్టు



పోలీసులు అదుపులోకి తీసుకున్న జానకీ శ్రీరాం

**సరూర్‌నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ బాలాపూర్ పోలీసులు బెంగుళూరు నుండి డ్రగ్స్ తెప్పించి విక్రయించడానికి ప్రయత్నించే ఓ యువకుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుడి వద్ద నుండి 1.6 గ్రాముల నార్కోటిక్స్ డ్రగ్స్ (ఎండిఎంఎ)ను స్వాధీనం చేసుకొని కేసును నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కొండాపూర్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన నాగిడి జానకీ శ్రీరాం (23) బెంగుళూరు నుండి తన స్నేహితుడు కౌషల్ ద్వారా డ్రగ్స్‌ను తెప్పించాడు. అయితే తన మరో స్నేహితుడు విశ్వా తో కలిసి డ్రగ్స్ తీసుకొనే జానకీ శ్రీరాం దానిని అవరమున్న వారికి విక్రయించి డబ్బులు సంపాదించాలని నిర్ణయానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం అంద డంతో బాలాపూర్ పిఎస్ పరిధిలో నుండి వెళ్తున్న జానకీ శ్రీరాంను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అతని వద్ద నుండి 1.6 గ్రాముల డ్రగ్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్ చేశారు. ఇన్స్‌పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలి : ఎంపి అనిల్ కుమార్ యాదవ్



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్

**చిక్కడపల్లి డిసెంబర్ 29 ( ప్రభాతవార్త ) :** ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో హైదరాబాద్ సెంట్రల్ వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం. అనిల్ కుమార్ యాదవ్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, బిఆర్ఎస్ యువనేత ముఠా జయసింహ, వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగ ప్రకాష్, రీజినల్ ఛైర్మన్ చక్రపాణి, పూర్వ అదనపు ఉపాధ్యక్షులు కృష్ణ, విజయలక్ష్మి , మన్నే దామోదర్ రెడ్డి , సంపత్ రెడ్డి , మాధవ్ రాయ్, రీజినల్ ఛైర్మన్ ఎస్.మురళీకృష్ణ , వై. శ్రీనివాస్ చారి, 2026 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ గంగాధర్ రెడ్డి, క్యాబినెట్ సెక్రటరీ శైలజ మోహన్, ఆర్. వివేక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రెసిడెంట్ శ్రీ పి.వి. నిరంజన్ రెడ్డి అధ్యక్షత వహించగా ఆఫీస్ బేరర్స్‌గా ఎస్. మనోహర్ రెడ్డి , సెక్రటరీ (2026 అధ్యక్షుడు ఎలెక్ట్); ఎం. దశరథ్ (కోశాధికారి), ఉపాధ్యక్షుడు వి. కళ్యాణ్ నాయక్ , వైస్ ప్రెసిడెంట్ నాగభూషణం , వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు నాగభూషణం, పూర్వ అధ్యక్షులు ఏ. శంకర్ రావు , ఏ. శ్రీనివాస్ రెడ్డి , ఎస్. రమేష్ రెడ్డి (ప్రోగ్రామ్ కోఆర్డినేటర్), ఆర్. సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా వాకర్స్ పాల్గొన్నారు. కిడ్స్ డ్యాన్స్, కథక్ డ్యాన్స్ మలయాళం సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఘన కార్యక్రమం ప్రెసిడెంట్ శ్రీ పి.వి. నిరంజన్ రెడ్డి ఆయన బృందం ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. ప్రతిరోజూ నడకను అలవాటు చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను, ఆరోగ్య స్పృహను పెంపొందించే ప్రయత్నాలను ఎంపీ అభినందించారు.

# హేతువాద ఉద్యమ పితామహుడు త్రిపురనేని రామస్వామి చౌదరి



ప్రసంగిస్తున్న విశ్రాంత హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ పాటిబండ్ల సత్యనారాయణ ప్రసాద్

**-విశ్రాంత హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్**

**చిక్కడపల్లి డిసెంబర్ 29,ప్రభాతవార్త :** త్రిపురనేని రామస్వామి చౌదరి కేవలం న్యాయవాది మాత్రమే కాదని, తెలుగు సమాజంలో హేతువాదానికి, వైజ్ఞానిక దృక్పథానికి పునాదులు వేసిన గొప్ప సంస్కర్త అని విశ్రాంత హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ పాటిబండ్ల సత్యనారాయణ ప్రసాద్ కొనియాడారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికలో న్యాయవాది, సంఘసంస్కర్త త్రిపురనేని రామస్వామి చౌదరి యాదిలో సభ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలను, అంధవిశ్వాసాలను పారద్రోలడానికి ఆయన తన కలం ద్వారా నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆయన రచించిన ఖిసూత పురాణంఖి వంటి గ్రంథాలు సామాజిక చైతన్యాన్ని కలిగించాయని గుర్తుచేశారు. పురోహితులు లేకుండా, మంత్రాలకు బదులు అర్థవంతమైన తెలుగు ప్రతిజ్ఞలతో ఖిసంస్కరణ వివాహాలుఖి (ఆదర్శ వివాహాలు) ప్రవేశపెట్టి ఆయన ఆచరణాత్మక సంస్కర్తగా నిలిచారని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ సాహిత్య రంగంలో ఆయన చేసిన అసమాన కృషికి గాను ప్రజలు ఆయనను ఖికవిరాజుఖి అని గౌరవించుకున్నారని, నేటి తరం ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గానసభ పాలకమండలి సమ్యుక్తా కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి, గాయని మంగరాజు రుక్మిణి పాల్గొన్నారు.

## సిగాచి బాధిత కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి: సురేందర్

**శేరిలింగంపల్లి,డిసెంబర్ 29పభాతవార్త** తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూలేని విధంగా జరిగిన సిగాచి పరిశ్రమ పేలుడులో మృతిచెందిన బాదిత కుటుంబాలకు పూర్తినష్టపరిహారం చెల్లించకపోవడం విచారకమని తెలంగాణ రాష్ట్ర జనశక్తి మజ్దూర్ సభ,లేబర్ సెల్ అధ్యక్షులు జి.సురేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిగాచి పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగిన సజీవదహనమైన 54మంది బాదిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర జనశక్తి మజ్దూర్ సభ,లోక్‌జనశక్తి పార్టీ లేబర్ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ.. సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగిన ఆరునెలలకు యజమానిని అరెస్ట్‌చేస్తే మరణించిన 54 మంది తిరిగివస్తారా అని ప్రశ్నించారు. సిగాచి కంపెనీయాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఎందరినో కార్మికులను పొట్టనపెట్టుకుందన్నారు.ఒక్కొక్క బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చిన సంస్థ ఆరుమాసాలైనా ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ముందుకు వచ్చి తక్షణమే బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు,ప్రభుత్వ ప్రమాధ భీమా, ప్రభుత్వ మధ్య వర్తిత్వంలో కార్పొరేషన్ ఏర్పాటు చేసి అందులోనుంచి తక్షణమే నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పిజెఆర్ మెమోరియల్ కప్ విజేత సుల్తాన్ షాహి టీం



విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీని అందిస్తున్న విజయారెడ్డి.

**జూబ్లీహిల్స్, డిసెంబరు 29, ప్రభాతవార్తః** దివంగత మాజీ సీఎల్పీ పి. జనార్ధన్‌రెడ్డి 18వ వర్ధంతిని పురస్కరించుకొని పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజేఆర్ మెమోరియల్ కప్ విజేతగా సుల్తాన్ షాహి టీం విజేతగా నిలిచింది. పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ ఎంఎస్ మక్తాలోని ఈద్గా గ్రౌండ్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. జంట నగరాల నుండి మొత్తం 70 టీములు ఇందులో పోటీపడ్డాయి. కాగా సుల్తాన్ షాహి టీం విజేతగా నిలువగా వారికి పీజేఆర్ ఫౌండేషన్ తరపున రూ. 25 వేల నగదు, ట్రోఫీని అందించారు. రన్నరప్‌గా ఆగాపుర యంగ్ స్టార్స్ టీం నిలవగా వారికి రూ. 10 వేల నగదు, ట్రోఫీని పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి అందించారు.

# సాధనతో ఏదైనా సాధ్యమే



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**సైఫాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** సాధన చేస్తే ఏదైనా సాధ్యమేనని విశ్రాంత ఉపాధ్యాయులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ మాజీ సంచాలకులు దువ్వూరి శేషగిరిరావు అన్నారు. ఆదివారం నారాయణగూడ హోటల్ తాజ్‌మహల్ నందు మలక్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఎస్సీ 1969 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల 5వ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆనాటి తమ మాథమేటిక్స్ అధ్యాపకులు డి.శేషగిరిరావు దంపతులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా శేషగారిరావు మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు విద్యారంగంలో ప్రభుత్వ విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు. పూర్వ విద్యార్థులు ఎప్పుడో చదువు చెప్పిన గురువులను మర్చిపోకుండా, గౌరవించటం ఎంతో ఆనందంగా ఉందన్నా రు. వివిధ రంగాలలో ఉన్న తమ స్నేహితులను ఒకరి నొకరు కలుసుకుని ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి మరుపురాని మధురమైన సంఘటనలు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. ఈ సమ్మేళనంలో వ్యాఖ్యాతలుగా పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, దుగ్గరాజు లక్ష్మి పద్మజ వ్యవహరించగా, మోహన్ ప్రసాద్, ఎన్.సి.కృష్ణమోహన్, మల్లాది వాసంతి తదితరులు పాల్గొని, సాంస్కృతిక కార్యక్రమాలతో రకరకాల ఆటలతో, పాటలతో రంజింపచేశారు.

## అనుమానాస్పదస్థితిలో నవవధువు మృతి

**అత్తాపూర్ డిసెంబర్ 29,ప్రభాతవార్త :** ఓ నవ వదువు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.నాగర్ కర్నూల్ జిల్లా చెందిన రాజు,మహబూబ్ నగర్‌కు చెందిన ఐశ్వర్యలు ప్రేమించుకొని పెద్దలను ఎదరించి పెళ్లి చేసుకున్నారు.రాజేంద్రనగర్ పరిధిలోని గోల్డెన్ హైట్స్ కాలనీలో కొత్తజంట దంపతులు రాజు,ఐశ్వర్య నివాసం ఉంటున్నారు.ఆదివారం పుట్టింటి నుండి ఇంటికి వచ్చారు.ఈ క్రమంలో కొద్దిసెప్పటికి యువతి భార్య ఐశ్వర్య కింద పడి కుప్పకూలింది.దింతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించాగా అప్పటికే మృతి చెందినట్లు వైదులు నిర్ధారించారు.తమ బిడ్డను అల్లుడు రాజు చంపి ఉంపాడంటూ నవ వధువు తల్లిదండ్రులు ఆరోపించారు.అదనపు కట్నం తీసుకురావాలని పలుసార్లు కూతురుని ఇంటికి పంపించినట్లు తల్లి దండ్రులు వాపోయారు.ఐశ్వర్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పబ్‌లో తనిఖీలు.. ఒకరికి డ్రగ్స్ పాజిటివ్

**జూబ్లీహిల్స్, డిసెంబరు 29, ప్రభాతవార్తః** కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని పలు పబ్‌లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని బ్రాడ్‌వే పబ్‌లో తనిఖీలు నిర్వహించగా బంజారాహిల్స్‌లో నివసించే ఫ్యాషన్ రిటైల్ మేనేజర్ సత్యఖి ఛతుర్జీ(25)ని తనిఖీ చేశారు. అతనికి ఈ-జెడ్ స్పిట్ కీ యూరిన్ పరీక్ష ద్వారా డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో భాగంగా అతనికి టీహెచ్‌సీ(గంజాయి) పాజిటివ్‌గా నిర్ధారణయ్యింది. నిందితుడు పబ్‌కు రాకముందు గంజాయి సేవించినట్లు పోలీసుల ముందు అంగీకరించాడు. నిందితుడిని అదుపులోకి తీసుకొని అతనిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

**గోషామహల్,డిసెంబర్ 30 ప్రభాతవార్త:** చలికి తట్టుకోలేక ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన సంఘటన గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్.ఐ అరవింద్‌గౌడ్ కథనం ప్రకారం...ముస్లీంజంగ్‌పూల్‌లోని భగత్‌సింగ్ విగ్రహం సమీపంలో ఈనెల 25వ తేదిన చలికి తట్టుకోలేక పడి ఉన్నాడు.స్థానికుల ద్వారా సమాచారంతెలుసుకున్న పోలీసులు గుర్తుతెలియని వ్యక్తి చికిత్సనిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ 26వ తేదిన మరణించినట్లు వైద్యులు దృవీకరించడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.మృతున్ని చేతిపై లలిత పచ్చబొట్టు ఉందన్నారు. అతన్ని స్థానికులు మల్లేష్ అని పిలుస్తారని చెప్పారు. వైట్, బ్లాక్,దుప్పటి ఉందన్నారు.ఈ కేసును గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

## గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**మాదాపూర్, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్ అయిన సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం, సిమ్లిభాంచాకి చెందిన అభిలాష్ మండల్ (29) మాదాపూర్‌లోని క్లైరా హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మద్యాహ్నం 12.30 గంటలకు అభిలాష్ మండల్ తన స్వగ్రామమైన ఒడిశా రాష్ట్రం నుంచి కొనుగోలు చేసిన 3.4 కిలోల గంజాయి (క్యానాబిస్)ను బ్యాగ్‌లో అక్రమంగా తరలిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం వచ్చింది. ఈ సమాచారం మేరకు మాదాపూర్‌లోని సిద్ధివినాయక్ నగర్‌లో పోలీసులు అభిలాష్ మండల్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 3.4 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి, నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుండి 3.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, మెటార్ సైకిల్ ఓడి30జి 3469 గల నెంబర్ వాహనాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు.

## పతంగుల దుకాణాలలో తనిఖీలు



పతంగుల షాపులలో తనిఖీలు చేస్తున్న కాలాపత్తర్ పోలీసులు

**చార్మినార్,డిసెంబరు 29 ప్రభాతవార్త :** కాలాపత్తర్ పోలీసులు సోమవారం రాత్రి పోలీస్ స్టేషన్ పరిధిలోనిపలు పతంగుల విక్రయించే షాపులను తనిఖీలు చేశారు.కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ డిఐ సత్యంతో పాటు పదిమంది పోలీసులు మోచీకాలనీ,కాలాపత్తర్ ప్రాంతాలలో గాలి పటాల షాపులకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు.

## త్రీ ఫేజ్ విద్యుత్ సమస్యను పరిష్కరించండి
: కార్పొరేటర్ సబిత కిషోర్


ఎడిఇకి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** అపరిష్కృతంగా ఉన్న త్రీ ఫేజ్ విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ రాష్ట్రపతి నిలయం ఎడిఇకి వినతి పత్రం అందించారు. సోమవారం ఎడిఇ రమాచారిని కలిసి కార్పొరేటర్ కానాజీగూడ, సుభాష్‌నగర్‌లులో ఉన్న సమస్యలను వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎడిఇ హామీ ఇచ్చినట్లు సబిత అనీల్ కిషోర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేత అనీల్ కిషోర్ ఇతరులు పాల్గొన్నారు.

## భువనవిజం గ్రౌండ్స్‌లో స్పోర్ట్స్ కార్నివాల్


పోటీలలో పాల్గొన్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** కెపిహెచ్‌బి భువన విజయం గ్రౌండ్లో స్పోర్ట్స్ కార్నివల్ ఉత్సవాలను భువన విజయం సేవా సమితి అసోసియేషన్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాక్స్ క్రికెట్, బాడ్మింటన్, టెన్నిస్, కిడ్స్ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ 100ఫీట్, 200ఫీట్, పరుగు పందేలు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, బీమ్ బ్యాగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో కాలనీ మహిళలు పిల్లలు పెద్దలు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలిచిన విజేతలకు జనవరి 25వ తేదీన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతులు మీదుగా బహుమతి ప్రధానం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ స్పోర్ట్స్ కార్నివాల్‌ను వ్యాపార ప్రముఖులు వెంకటరావు, సత్యనారాయణ (పండు) సహాయ సహకారాలతో భువన విజయం సేవా సమితి ప్రెసిడెంట్ గురువు తిరుపతి రావు, సభ్యులు పి.వి రావు, నాగప్రసాద్, రమణారెడ్డి, అమరప్రభు, వెంకట్, సుభాష్ వేణు, మురళి, కళ్యాణి, అరుణ శ్రీలక్ష్మీ తదితరులు ఘనంగా నిర్వహించారు.

## సర్పంచ్ దామోదర్ రెడ్డిని సన్మానించిన బండి రమేష్


దామోదర్ రెడ్డిని సన్మానిస్తున్న బండి రమేష్

**కూకట్‌పల్లి, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన దామోదర్ రెడ్డి సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యాలయం హేమ దుర్గాభవన్లో టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్‌ని కలిశారు. ఈ సందర్భంగా ఆయన దామోదర్ రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. దామోదర్ రెడ్డి ఎన్నికల ముందు వరకు హైదరాబాద్ కూకట్‌పల్లి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రాంతాల్లో పాత్రికేయులుగా పని చేశారని రాష్ట్రంలో పంచాయితీలకు ఎన్నికలు ప్రకటించడంతో ఎన్నికల్లో పాల్గొన్న దామోదర్ రెడ్డి తన స్వగ్రామం నుంచి ప్రెసిడెంట్‌గా గెలుపొందారని అన్నారు. తనను కలిసిన దామోదర్ రెడ్డిని అభినందిస్తూ పార్టీ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి మేర కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, రాఘ వేంద్ర, విటల్ రెడ్డి, మొయినుద్దీన్, హమీద్, కొండల్ రెడ్డి, కిట్టు, రజినీకాంత్, తిరుపతయ్య, మధుమోహన్, వినయ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## బాలాజీ నగర్‌లో సీనియర్ సిటిజన్స్ భవనం ప్రారంభం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం, ఎమ్మెల్సీ నవీన్‌రావు

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ డివిజన్ ప్రగతి నగర్‌లో 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీనియర్ సిటిజన్ బిల్డింగ్‌ను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని, ఎమ్మెల్సీ కె నవీన్ రావు బాలాజీ నగర్ కార్పొరేటర్ శిరీష బాబురావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రగతినగర్ పరిసర ప్రాంతాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే త్వరలోనే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ టిఆర్‌ఎస్ అధ్యక్షుడు స్వేచ్ఛ ప్రభాకర్ గౌడ్, ప్రగతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భూమన్న అశోక్ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు వినోద్ కుమార్, అశోక్ కృష్ణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే కేపీ


మాజీ సీఎం కెసిఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వివేకానంద

**జీడిమెట్ల, డిసెంబర్ 29, ప్రభాతవార్త** తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా సోమవారం శాసనసభకు హాజరైన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకి పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆత్మీయంగా స్వాగతం పలికారు.

### కెటిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

శీతకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్)ని బిఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు సి.హెచ్. మల్లారెడ్డి, మాణిక్ రావు కూడా పాల్గొన్నారు.

# ముగిసిన టిడిపి నేత సాయిబాబా అంత్యక్రియలు

-నివాళులర్పించిన ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు


సాయిబాబా పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ, బక్కని నర్సింహులు

**ముషీరాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో హఠాన్మరణం పొందిన టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ పి.సాయిబాబా (69) అంత్యక్రియలు గోల్నాక స్మశాన వాటికలో ముగిశాయి. సోమవారం ఉదయం సాయిబాబా పార్థీవ దేహాన్ని అభిమానుల సందర్శనార్థం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయానికి తీసుకువచ్చారు. దివంగత ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్, పోలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, సాయిబాబా పార్థీవదేహంపై పార్టీ జెండా ఉంచి, శ్రద్ధాంజలి ఘటించారు. ఎంఆర్‌పీఎస్ అధినేత, పద్మశ్రీ మందకృష్ణమాదిగ, ఆంధ్రప్రదేశ్ వికలాంగుల కార్పోరేషన్ ఛైర్మన్ కోటేశ్వర్ రావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నేతలు బీఎన్.రెడ్డి, బంటారం యాదగిరిగౌడ్, బీజేపీ నేత జిష్ణుజోషి, టీడీపీ రాష్ట్ర నాయకులు కాశినాథ్, నల్లెల్ల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, నాగు నగేష్, శ్రీపతి సతీష్, బాలాజీ గోస్వామి, వల్లారపు శ్రీనివాస్, మోహన్, భాను, శ్యాం, అనిల్, శక్తి ప్రేమ్, శ్యాం సుందర్, ఆలిండియా నందమూరి అభిమాన సంఘం నాయకులు, వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన అభిమానులు, దివ్యాంగులు ఆయన పార్థీవ దేహంపై పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షునిగా, దివ్యాంగుల కార్పోరేషన్ ఛైర్మన్‌గా పనిచేయటమే కాకుండా పార్టీకి అన్ని విధాల ఎనలేని సేవలు అందించిన పిన్నమనేని సాయిబాబా మృతితో తెలుగుదేశం పార్టీ తెలంగాణలో ఒక పెద్ద దిక్కును కోల్పోయిందని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా ఆశయాల సాధనకై దివ్యాంగులు, యువత, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాటుపడాలని పిలుపునిచ్చారు. సాయిబాబా కుటుంబానికి ఎల్లప్పటికీ అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం అంతిమయాత్రలో కుటుంబసభ్యులతో పాటు వివిధ రాజకీయ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని, కన్నీటి వీడ్కోలు పలికారు.

## ఎస్సీల సంక్షేమాన్ని మర్చిపోయి ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం : డా.నాగరాజు


ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

**నిజాంపేట్, డిసెంబర్ 29, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీల ఓటు బ్యాంకుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీల సంక్షేమాన్ని పూర్తిగా మర్చిపోయి ప్రజలను మోసం చేసిందని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ పేషీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిజాంపేట్ సర్కిల్ బిజెపి నాయకులతో కలిసి దాసి నాగరాజు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా సహజంగానే వెనకబడిన ఎస్సీ సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక స్వావలంబన లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో యువత, మహిళలు, రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలు 420 వాగ్దానాలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అంబేద్కర్ అభయహస్తం పేరుతో ఎస్సీ కుటుంబానికి ఇస్తానన్న 12 లక్షల రూపాయలు ఎటు పోయినవో రాష్ట్ర ఎస్సీ ప్రజలకు ప్రభుత్వం జవాబు చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో వేలాది ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందట్లేదని తెలిపారు. తద్వారా బాధితులు ఆర్థిక సహకారం లేక అవస్థలు పడుతున్నారని వాపోయారు. చట్టబద్ధంగా న్యాయంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఎస్సీల సంక్షేమం కోసమే వినియోగించాలనే నిబంధన ఉన్నప్పటికీ ఎందుకు మిగిలిన సంక్షేమ పథకాలకు వాటిని మళ్లిస్తున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం జవాబు చెప్పాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన ఏ హామీని వదిలిపెట్టే ప్రసక్తే లేదని కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ ఆధ్వర్యంలో వాటి అమలు కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, బిజెపి నాయకులు బాబు చౌదరి, మణికంఠ పాల్గొన్నారు.

## కల్చరల్ సెంటర్‌లు ఐకమత్యాన్ని ప్రతిబింబించాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో లక్ష్మారెడ్డి, పద్మారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**జూబ్లీహిల్స్, డిసెంబరు 29, ప్రభాతవార్తః** కాలనీల్లో ఏర్పాటుచేసుకొనే కల్చరల్ సెంటర్‌లు ఐకమత్యాన్ని ప్రతిబింబించేలా ఉండాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేస్‌ఎంపీస్ కాలనీ కల్చరల్ సెంటర్‌లో మెయిన్ గేట్, ఏఎంఆర్ లాన్స్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నగరంలో ఇప్పుడు చాలా సొసైటీలు కల్చరల్ సెంటర్లను ఏర్పాటుచేసుకొంటున్నాయని, తద్వారా కాలనీవాసులంతా కలిసి ఇక్కడ పలు వేడుకలను నిర్వహించుకోవచ్చన్నారు. ఒక మంచి వాతావరణం ఉండటంతోపాటు ప్రశాంతంగా సమయాన్ని గడపడానికి ఇవి ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేస్‌ఎంపీస్ కాలనీ ప్రధాన కార్యదర్శి రాగిడి లక్ష్మారెడ్డి, ఏఎంఆర్ అధినేత మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, ఇనుగాల పెద్దిరెడ్డి, సీఎం మామ పద్మారెడ్డి తదితరులతోపాటు కాలనీ వాసులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మంచి నీటి సమస్యను పరిష్కరించండి: కార్పొరేటర్


జీఎంకు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** మంచినీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి జలమండలి జీఎంకు వినతి పత్రం అందించారు. సోమవారం జీఎం సునీల్‌ను కలిసి డివిజన్ పరిధిలోని మంచినీటి పైపు లైన్లు ఏర్పాటుకు సంబంధించి వినతి పత్రం అందించారు. జీఎం సానుకూలంగా స్పందించారని సమస్యలు పరిష్కారం అవుతాయనే అశాభావంతో ఉన్నామని శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## ఆదివాసి కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్‌కి అందజేస్తున్న దృశ్యం

**నిజాంపేట్, డిసెంబర్ 29, ప్రభాతవార్త** హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ ఆధ్వర్యంలో నవకేతన్ మోడల్ స్కూల్ ఫౌండర్, ప్రిన్సిపల్ డైరెక్టర్ ముడికె పవన్ కుమార్ యాదవ్, ముడికె జయశ్రీల సహకారంతో కొత్తగూడెం జిల్లా, పినపాక మండల పరిధిలో ఉన్న 130 ఆదివాసి కుటుంబాలకు చలికాలంలో దట్టమైన అడవిలో చలికి ఇబ్బంది పడుతున్న వారికి తమ కుటుంబ సభ్యులు ఒక సామాజిక బాధ్యతతో పవన్ కుమార్ స్పందించి రూ. 24,000 ఆర్థిక సాయంతో 130 దుప్పట్లు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులు, మిత్రులు మదను భాస్కర్, తానం జోసెఫ్ రెడ్డి, ముడికె మనస్విని, తెర్లి హేమల చేతుల మీదుగా హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ మూడే లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## ప్రోత్సాహముంటే ప్రతి ఒక్కరూ తమ కళల్లో రాణిస్తారు
: ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు


సత్కారగ్రహీతలతో రుద్రరాజుపద్మరాజు, లక్ష్మీనారాయణ, సంధ్యారాణి, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 29 ప్రభాతవార్త :** అవకాశమిచ్చి తగిన ప్రోత్సాహం అందిస్తే ప్రతీఒక్కరూ తమ తమ కళల్లో గొప్పగా రాణిస్తారని, ప్రధానంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని ఏపి ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు అన్నారు. పిల్లలు నృత్య సంగీత సాహిత్యాలతో సాధికారితను సాధిస్తారని, తద్వారా మన సంస్కృతి వెల్లివిరుస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన నూతన సంవత్సరం 2026 వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన పద్మరాజు ఆత్మీయ అతిథులు డా. జయంతిరెడ్డి, దైవజ్ఞశర్మ, రఘుశ్రీ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి తదితరులతో కలిసి ఈనాటి సాంస్కృతిక కార్యక్రమాలు కూచిపూడి నృత్యప్రదర్శన, హాస్యవల్లరి, గీతాలాపనలో పాల్గొన్న కళాకారులను ఘనంగా సత్కరించారు. సభకు ముందు జరిగిన కళాప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## అయ్యప్పస్వామి పూజ



**అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** అయ్యప్పస్వామి మహాపడి పూజను అంగ రంగ వైభవంగా జరిపారు. మహాపడి పూజలో అయ్యప్పస్వామి భక్తి గీతాలను ఆలపించారు. ఈ అయ్యప్పస్వామి మహాపడి పూజలో ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త పాల్గొన్ని ప్రత్యేక పూజలను చేశారు. అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## వీధిదీపాలు ఏర్పాటు చేయండి


డిప్యూటీ కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న గణేష్

**దుండిగల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త** ఓఆర్ఆర్ నుంచి దుండిగల్ గ్రామం వరకు వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సోమవారం ఉమ్మడి కుత్బుల్లాపూర్ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ ఓఆర్ఆర్ జంక్షన్ నుంచి దుండిగల్ గ్రామం అంబేద్కర్ విగ్రహం వరకు రాత్రి వేళల్లో ఘనమైన చీకటి నెలకొని ఉండటంతో పాద చారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జక్కుల గోపాల్ యాదవ్, పండుగ శ్రీశైలం ముదిరాజ్, సిరగల్ల బాబు, వాపుల శ్రీనివాస్, దొంతి మహేష్ ముదిరాజ్, దత్తు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నిస్తేనే బలమైన సమాజ నిర్మాణం : గడ్డం శ్రీనివాస్ యాదవ్


ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్

**గోషామహల్, డిసెంబర్ 29ప్రభాతవార్త:** సమాజంలో ప్రశ్నించే గొంతు తయారైనప్పుడు బలమైన సమాజం నిర్మితమవుతుందని, ఆ దిశగానే గోషామహల్ నియోజకవర్గంలోని సమస్యలపై పోరాడుతుఅధికారులకు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకుగాను కృషి చేస్తానని హైదరాబాద్ పార్లమెంట్ బి.ఆర్.ఎస్ ఇన్‌చార్జ్, గడ్డం గంగాధర్ యాదవ్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారంఉస్మాన్‌షాహిలోని జంగల్ విఠోబా దేవాలయంలో విఠలేశ్వర రుక్మాబాయిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గంలో బస్తీ-నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అక్కడే ఏర్పాటుచేసిన బస్తీ-నిద్ర కుటీర కేంద్రాన్ని గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుత ఈ బస్తీ-నిద్ర కార్యక్రమం ద్వారా, బస్తీలలో నెలకొన్న సమస్యలు చేపట్టాల్సిన మౌళిక, వసతులు, నిరుపేద విద్యార్థులకు అందించాల్సిన క్రియేటివ్ ఏడ్యుకేషన్ ప్రజా, ఆరోగ్యం, నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగం భద్రతగా, రాజకీయ నవీకణ, తదితర అంశాలపైన వివరాలను అడిగి తెలుసుకుని, పరిష్కారం కోసం తమ వ్యాలంటరీలను ఆయా బస్తీలోకివెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కారం కోసం అక్కడేఏర్పాటు చేసిన కుటీర కేంద్రంలో వివరాలు సేకరించి, పరిష్కారానికి, కృషి చేస్తామన్నారు. తర్వలోనేగడ్డం పొలిటికల్ అకాడమీని ఏర్పాటు చేసి విద్యావంతులైన యువకులకు, యువతీలకు రాజకీయాలకు విలువలు, సిద్ధాంతాలు, నీతివంతమైన రాజకీయం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ముఖ్యంగాస్థానిక శాసనసభ్యులు టి.రాజాసింగ్, బేగంబజార్ కార్పొరేటర్లు జి.శంకర్‌యాదవ్‌లు అవినీతిలో కూరుకుపోయినట్లు ఆరోపించారు. వేలకోట్లలో ఆస్తులు సంపాదించారని, త్వరలో వీరి అవినీతిపై బస్తీ-నిద్ర కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో విఠోభా దేవాలయం అధ్యక్షులు వి.కిషన్‌యాదవ్, ఎం.మాణిక్‌రావు, లక్ష్మన్, శ్రీనివాస్‌యాదవ్, క్రాంతి, ఎం.నిర్మల్‌కుమార్‌యాదవ్, వినోద్, సరస్వతి, హరిక, లతా తదితరులు పాల్గొన్నారు.

## యువకుల ఉజ్వల భవిష్యత్తుకు భాషానిలయం : డా. కె.వి.రమణాచారి


సభలో ప్రసంగిస్తున్న రమణాచారి, విశ్వనాథం, ఉదయవర్లు

**నాంపల్లి, డిసెంబరు 29 ప్రభాతవార్త :** కళాశాలస్థాయి విద్యార్థులలో వ్యక్తిత్వ వికాసం, జీన నైపుణ్యాలు, భాష, సాహిత్య, సాంస్కృతిక తదితర అంశాలపట్ల ఆసక్తి కలిగించడానికి, సంఘటితపరిచి చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం యువతకోసం పేరిట ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించినట్లు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, భాషానిలయం అధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి తెలిపారు. ఈమేరకు భాషా నిలయంలోని డా. రావిచెట్టు రంగారావు కళావేదికలో రమణాచారి అధ్యక్షతన జరిగిన ప్రాథమిక కార్యక్రమంలో జంటనగరాలలోని పలు కళాశాలల ప్రధాన అధ్యాపకులు, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వకర్తలు పాల్గొన్నారు. సుప్రసిద్ధ వ్యక్తిత్వ వికాస బోధకులు డా. వంగపల్లి విశ్వనాథం నేతృత్వంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం యువత కోసం కార్యక్రమం ఏడాది పొడవునా ప్రతీ నెల రెండవ గురువారం మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు నిర్వహించ తలపెట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం తెలుగు భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు విశ్వనాథంలు ప్రసంగించారు.

## పాఠశాలలో ఉత్సాహంగా అలుమ్ని మీట్

**జూబ్లీహిల్స్, డిసెంబరు 29, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్‌లోని పి. ఓబుల్ రెడ్డి స్కూల్‌లో ప్రతి సంవత్సరం సంప్రదాయంగా నిర్వహించే పాప్స్ అలుమ్ని మీట్ ఈ ఏడాది కూడా ఘనంగా జరిగింది. సుమారు 400 మంది పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరై, ఆహ్లాదకరమైన వాతావరణంలో తమ పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తమకు విద్యాబోధన చేసిన గురువులను వారంతా ఘనంగా సన్మానించగా, గురువుల సేవలను పూర్వ విద్యార్థులు కృతజ్ఞతతో గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు, తరగతి గదుల్లో గడిపిన మధుర క్షణాలు గుర్తుచేసుకుంటూ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. పాప్స్ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షురాలు నిచ్చల, కార్యదర్శి బొందలపాటి కీత్ చౌదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలా పూర్వ విద్యార్థులు అందరూ ఒక్కచోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కలయిక ద్వారా పాఠశాలతో ఉన్న అనుబంధం మరింత బలపడుతోంది అన్నారు. ఈ సందర్భంగా పలు వినోదాత్మక పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమం ద్వారా ఎవరు ఏ రంగాల్లో స్థిరపడ్డారు, విద్య, వైద్యం, ఐటీ, వ్యాపారం, పరిపాలన తదితర రంగాల్లో తమ అనుభవాలను పరస్పరం పంచుకున్నారు. ఈ అలుమ్ని మీట్ ద్వారా పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాలు మరింత బలపడటంతో పాటు, భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహకరించే అంశాలపై కూడా చర్చలు జరిగాయి. ఇప్పటినుండి అలుమ్ని అసోసియేషన్ ట్రస్ట్ కింద పలు సేవా కార్యక్రమాలు చేసే విధంగా తీర్మానం చేశారు.

## 23 సంఘాలతో 'పవర్ ఎంప్లాయిస్ జెఏసి'

చైర్మన్‌గా సాయిబాబు, సెక్రటరీగా శ్రీధర్, కన్వీనర్‌గా రత్నాకర్‌రావు


నూతన కమిటీతో సాయిబాబు, శ్రీధర్, రత్నాకర్‌రావు, బిసిరెడ్డి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త:** విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే ఊరుకునేదే లేదనితెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ హెచ్చరించింది. ఈమేరకు సోమవారం పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ భవన్‌లో జరిగిన సమావేశంలో 23 సంఘాలతో కలిసి జెఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా మరోసారి జి సాయిబాబు ఎన్నికకాగా సెక్రటరీ జనరల్‌గా శ్రీధర్, కన్వీనర్‌గా పి. రత్నాకర్ రావు, కో కన్వీనర్ గా బీసీ రెడ్డిలను ఎన్నుకున్నారు. అలాగే వైస్ చైర్మన్లుగా టీ మహేష్, ఎంఏ వజీర్, జాయింట్ సెక్రెటరీగా వి.గోవర్ధన్, డి. శ్యామ్ మనోహర్, ఎం.తులసి నాగరాణి, ఫైనాన్స్ సెక్రటరీగా ఎం కరుణాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎమ్. రాంజీ, ఎం. నెహ్రూ, ఎస్.లోహితానంద్ జి. నాగరాజు, కె.సత్యనారాయణ రావు, ఆర్.మోసెస్, సిహెచ్.గిరిధర్, పి.శ్రీనివాస్, కెవి.రామారావు జి.సతీష్ కుమార్ జి అరవింద్ కుమార్, ఆర్.మురళిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జేసీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా జేఏసి నేతలు మాట్లాడుతూ పిఆర్సి 2026 ను ఏప్రిల్ నెల నుంచి అమలు చేయుటకు పే రివిజన్ నెగోషియేషన్ కమిటీని వెంటనే నియమించాలని, రిటైర్ అయిన జిపిఎఫ్ ఉద్యోగులందరికీ మెడికల్ ఫెసిలిటీ కల్పించాలని 2022 నుండి నియమితులైన ఉద్యోగులందరికీ ఈపీఎఫ్ సీలింగ్ ఎత్తివేయాలన్నారు. అలాగే యాదాద్రి పవర్ ప్లాంట్ ఫేస్ టూ ప్రైవేట్ పరం చేయొద్దని తీర్మానించి విద్యుత్ సంస్థల ఉద్యోగుల ద్వారానే నడపాలని సూచిస్తూ యాజమాన్యానికి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే మూడవ డిస్కం విధివిధాలు, జెన్కో ద్వారానే రామగుండం పావ్లంచ కేంద్రాలను నిర్మించాలని, హైకోర్టు ఆర్డర్ ప్రకారం విద్యుత్ సంస్థలలో ఉద్యోగులుగా నియమితులైన 1999 నుండి 2004 ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అలాగే ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. విద్యుత్ సంస్థల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అలాగే నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ ఇచ్చే పిలుపుమేరకు విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయకుండా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పనిచేయాలని జేఏసీ ఇచ్చే కార్యక్రమాలన్నింటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని అసోసియేషన్‌ల ప్రెసిడెంట్, సెక్రటరీ జనరల్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పనితీరుకు ఆకర్శితులై పార్టీలో చేరిక : బండి రమేష్.


బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సురేష్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండిరమేష్,

**బేగంపేట డిసెంబరు 29, ప్రభాతవార్త ప్రభాతవార్త** కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుతో ఆకర్షితులై భారీ సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. ఆదివారం రాత్రి కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ పరిధిలోని శ్యాంలాల్ బిల్డింగ్‌లో బేగంపేట మాజీ కార్పోరేటర్ యాదయ్య కుమారుడు కెంబాసారం సురేష్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో కల్సి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బేగంపేట డివిజన్ అధ్యక్షుడు గౌరపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బండి రమేష్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో బస్తీలు, కాలనీల నుంచి కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు నమోదవుతున్నాయన్నారు. కెంబాసారం సురేష్ కు బీఆర్‌ఎస్‌లో అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ పార్టీలో తనకు సముచిత స్థానం కల్పిస్తామని బండి రమేష్ హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షుడు గౌరపల్లి రమేష్ ,సురేష్ ల ఆధ్వర్యంలో బేగంపేట డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయిందని, రానున్న రోజుల్లో కార్యకర్తలను తగిన విధంగా గౌరవించుకుంటామన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, బీజేపిలనుంచి వచ్చిన కార్యకర్తలకు బండి రమేష్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హాజీటోచర్, దర్గ కరుణాకర్, బి.ప్రవీణ్, కిరణ్, శ్యామ్, అహ్మద్, సత్తార్, శ్రీను, దేవ, బాలకుమార్, రంగయ్య, అశోక్, మహిళా నాయకురాళ్లు బాలమని, సంధ్య, లక్ష్మి, అనురాధ, దయానంద్, జహంగీర్, నర్సింగరావు, రమాదేవి, రాకేష్, భరత్, సురేష్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

**NOTICE FOR LOSS OF PROPERTY DOCUMENT**

The general public are hereby cautioned that my client **Sri Badeti Gurumurthy,** R/o Plot No.813, 'Sai Sadan', Road No.7, Near Community Hall, Sri Sai Balaji Homes, Phase-II, Badangpet, Ranga Reddy District-58, has lost the original property document of his daughter Mrs. Neha Mani Manjari, vide Regd. Sale-Deed Doc. No.15123/2019, Dt.17.05.2019, SRO, Yadagirigutta., while travelling in Badangpet. The general public are hereby cautioned not to deal with the third parties in respect of the Schedule Property without our consent/permission and the general public are hereby informed that in case the original sale-deed is found, kindly return to the above mentioned address or to the undersigned.

**Schedule Property**

All that the part and parcel of Open Plot No.659, in 'Pudami Developers', in Sy.No.196/AA4, admeasuring 200 Sq.Yds., situated at Bahupet, H/o Masaipet (V), Yadagirigutta (M), Yadadri-Bhongir District., and bounded by : **North** : Plot No.660 **South** : Plot No.658, **East** : Plot No. 581, **West** : 30' Wide Road.

**Sd/- G. Sanker Prasad**
**Advocate**
H.No.6-3-2070 (S/4/C-565),
N.G.O's Colony,
Vanasthalipuram,
Hyderabad-70.
**Mobile No.78010 05191.**

**IN THE COURT OF THE HON'BLE I ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT :: L.B. NAGAR**
**I.A.No. 1406 of 2023**
**in**
**O.S.No. 176 of 1999**

Between:-
**Smt. M. Geetha** W/o. M. Sanjeeva Reddy. ...**Petitioner/Plaintiff.**
and
**Bokka Madhusudhan Reddy and another.** ...**Respondents/Defendants.**

To,
**R3). Bokka Jayamma** W/o. Bokka Madhusudhan Reddy, Age: 58 years, R/o. Flat No.206, Annapurna Residential Complex, 17-85, Road No.1, Kamalanagar, Beside Sreehitha Hospital, Chaitanyapuri, R.R. District.
**R4). Bokka Sai Teja Reddy** S/o. Bokka Madhusudhan Reddy, Age: 33 years, R/o. H.No.6-99, Durga Nagar, Injapur Village, Abdullapurmet Mandal, R.R. District.
**R5). B. Mani Deep Reddy** S/o. Bokka Madhusudhan Reddy, Age: 31 years, R/o. H.No.6-99, Durga Nagar, Injapur Village, Abdullapurmet Mandal, R.R. District.

Whereas the above named Petitioner/Plaintiff has filed the above petition against the Respondents/ Defendants, praying above Hon'ble Court to pass Final Decree in the above suit as per the report submitted by the commissioner (after partition, allotment made by the Commissioner between the Petitioner and the Respondents) in terms of Preliminary Decree in respect of the Petition Schedule Properties appended to the Petition, in the interest of justice.

You the above named Respondents No.3 to 5/Defendants No.3 to 5 i.e. Legal Heirs of Respondents No.1/ Defendant No.1 take notice that, the above case is posted on **28-01-2026 at 10.30 am** for your appearance and counter, if any, and if you failed to appear before the above Hon'ble Court either in person or through advocate, otherwise the matter will be decided in your absence.

//BY THE ORDER OF THE COURT//

**Sd/- KAMTALA SREENIVAS**
**Advocate**
H.No.11-6-141, Pochammabagh Colony, Saroornagar, Hyderabad-500035. **Cell No. 9440129813**
**Counsel for the Petitioner/Plaintiff**

## జోహార్‌నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



**మల్కాజిగిరి డిసెంబరు29,ప్రభాతవార్త :**
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జోహార్ నగర్ లో స్థానికుల పిలుపు మేరకు కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ పర్యటించారు. ఆంజనేయ స్వామి ఆలయం లో షెడ్ ఏర్పాటు చేయాలని పెండింగ్‌లో ఉన్న రోడ్ల డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని తెలిపారు.సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నారాయణ మల్లేష్, పల్లె విజయ కుమారి కిశోర్,అశోక్ పాల్గొన్నారు

## అధికారుల నిర్లక్ష్యంతో పార్కులో అభివృద్ధి పనులు అస్తవ్యస్తం: కార్పొరేటర్



రాజీవ్ గాంధీ పార్కులో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం డిసెంబర్ 29 ప్రభాతవార్త.**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విబిప్పీ కాలనీ రాజీవ్ గాంధీ పార్క్ ను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ పార్కు అభివృద్ధి కొరకు 65,00,00 లక్షలు రూపాయలతో మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తే అధికారుల పర్యవక్షణ లేక నాణ్యత లోపాలతో మరమ్మతులు నిర్వహించడం జరిగిందని వెంటనే సంబంధిత అధికారులు పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పార్క్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి,ఎం కె గౌడ్, దామోదర్ రెడ్డి మరియు తదితరులు ఉన్నారు

## మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగాలి : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మున్నూరు కాపు క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తీన్ మార్ మల్లన్న, పోతంశెట్టి భరత్ కుమార్ పటేల్ , ఆకుల మధుకర్, మున్నూరు కాపు సంఘం సభ్యులు

**మేడిపల్లి,డిసెంబర్29,ప్రభాతవార్త :**
మున్నూర్ కాపులు ఐక్యంగా ఉండి రాజకీయాలలో రాణించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిదిలోని శంకర్ నగర్ లో నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ఆవిష్కరణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బల్లెపు చంద్రశేఖర్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ నల్లగొండ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మున్నూర్ కాపు సంఘం కోసం సంఘం సభ్యులు పనిచేయాలని అదేవిధంగా రాజకీయాలలో రాణించి చట్ట సభలలో ప్రజాప్రతినిధులుగా అదిక సంఖ్య ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం మేడ్చల్ జిల్లా మున్నూరు కాపు సంఘం కార్యవర్గంలోకి ఎన్నుకోబడిన పోతంశెట్టి భరత్ కుమార్ పటేల్ ను తీన్మార్ మల్లన్న సన్మానించి,శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఆకుల శ్రవణ్ కుమార్ పటేల్, సలహాదారులు ఆకుల మధుకర్ పటేల్, పాశం సత్తయ్య పటేల్, వీరమల్ల జగన్నాథం పటేల్, కోనేటి వెంకట్ పటేల్, జైంట్ సెక్రటరీ వాడపల్లి నరేష్ పటేల్,పాశం రాజు పటేల్,మన్నే సోమయ్య, శ్రీ వీరాంజనేయ దేవస్థానం ధర్మకర్త సింగం లక్ష్మణ్ పటేల్ లు పాల్గొన్నారు.

## బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి : రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్, ధనుంజయ, పెంటయ్య తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**
మూసీ నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జ్ వలన 50కుటుంబాలు రోడ్డుపాలవుతున్నాయని ముసారంబాగ్ అలీ కేఫ్ అంబర్పేటకు చెందిన మూసి బ్రిడ్జి బాధితులు రాజశేఖర్ , ధనుంజయ, పెంటయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సలీం నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మా బతుకులు ఆగం కాకుండా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు కటింగ్ వలన ఇరువైపులా 150 కుటుంబాలు జీవనాధారం కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన టెక్నాలజీ ఆధారంగా బ్రిడ్జికి రెండు వైపులా పిల్లర్లు వేయకుండా మధ్యలో ఒకే పిల్లర్ తో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. దీంతో తమకు కొంత ఊరట లభిస్తుందని చెప్పారు. పలువురు ప్రజాప్రతినిధులకు, గ్రేటర్ కమిషనర్ కు పలు దఫాలుగా వినతి పత్రం అందజేసిన పరిష్కారం దొరకలేదని అన్నారు. గజం స్థలానికి రెండు లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇప్పిస్తే వ్యాపారాలు చేసుకుని జీవనం కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నిరంజన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## పిజేఆర్ సేవలు ఎనలేనివని : షేక్ అక్బర్



మాజీమంత్రి పీజేఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న షేక్ అక్బర్, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**
దివంగత మాజీ మంత్రి పిజేఆర్ చేసిన సేవలు ఎనలేనివని మలక్ పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓల్డ్ మలక్ పేట్ లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి పిజేఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ ఒబిసి సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్,బి బ్లాక్ అధ్యక్షుడు మదన్ బాబు, అజంపురా డివిజన్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ల పునర్విభజనలో ప్రజాభిప్రాయం బుట్టదఖాలు: దండెం రాంరెడ్డి

### -అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోని అధికారులు..పట్టించుకోని ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**హయాత్‌నగర్ డిసెంబరు29,ప్రభాతవార్త :**
బీఆర్ఎస్ నాయకులుపెద్ద అంబర్పేట, కుంట్లూరు డివిజన్ల ఏర్పాటులో ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డి విమర్శించారు. సోమవారం పెద్ద అంబర్పేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ పునర్విభజనలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. వ్యవసాయాధారిత గ్రామాలైన తారామతిపేట, గౌరెల్లి, బాచారం, కుత్బుల్లాపూర్ లను జీహెచ్ఎంసీలో కలపడంతో ప్రజలపై పన్నుల భారం ఎక్కువై పోతుందన్నారు. కుంట్లూరు డివిజన్ లో కుంట్లూరు గ్రామ రెవెన్యూ లేకపోవడం, పెద్ద అంబర్పేట్ డివిజన్లో కుంట్లూరు, పసుమములు, తట్టి అన్నారం గ్రామలను చేర్చడం అధికారుల అవగాహన లోపానికి నిదర్శనమన్నారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు, అభ్యంతరాలు వచ్చినా అధికారులు వాటిని బుట్టధాఖలు చేసారని మండిపడ్డారు. అసలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉన్నారా.... లేరా అనేది అర్థం కావడం లేదన్నారు. నియోజక వర్గంలోని పెద్ద అంబర్ పేట, కుంట్లూరు డివిజన్ల విభజనలో నెలకొన్న అయోమయాన్ని పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడుతున్న అన్ని డివిజన్ల లో లోపాలు సరిచేయాలన్నారు. లేని పక్షంలో కోర్టుకు వెళ్లి న్యాయపరంగా తేల్చుకుంటామన్నారు. సమావేశంలో నాయకులు ఈదమ్మల్ల బలరాం, కళ్ళెం ప్రభాకర్ రెడ్డి, దామోదర్, మండల కోటేశ్వర్ రావు, తొండెపు బ్రహ్మానంద రెడ్డి, దేసారం బాలకృష్ణ గౌడ్, పిల్లి నగేష్ యాదవ్, భాస్కర్ గౌడ్, ఇర్ఫాన్, జోర్క రాము పాల్గొన్నారు.

## వార్డుల విభజన వల్ల తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రజలకు అన్యాయం

### -తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం డైరెక్టర్ లక్ష్మారెడ్డి



**తుర్కయంజాల్ డిసెంబర్ 29( ప్రభాతవార్త)**
వార్డుల విభజన వల్ల తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.సోమవారం తుర్కయంజాల్ సర్కిల్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రొక్కం సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శంషాబాద్ డివిజన్లో ఆదిభట్ల సర్కిల్ గా చేయడం వలన తుర్కయంజాల్ మున్సిపాలిటీ లో ఉన్నటువంటి మారుమూల గ్రామాల ప్రజలు ఆదిభట్ల శంషాబాద్ వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. అలాగే తుర్కయంజాల్ ఉనికి లేకుండా చేయడం సబబు కాదు కావున బిఆర్ఎస్ పార్టీ తరపున తుర్కయంజాల్ మున్సిపాలిటీ నాయకులు కార్యకర్తలు తీవ్రంగా ఖండిస్తున్నాము. తుర్కయంజాల్ మున్సిపాలిటీని సర్కిల్ గా ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఢిల్లీలో తుర్కయంజాల్ మున్సిపాలిటీకి ఆదర్శ మున్సిపాలిటీ అవార్డు కూడా ఇచ్చారు. ఎక్కడలేని విధంగా తుర్కయంజాల్ అభివృద్ధిలో ముందడుగు ఉందని అన్నారు. కావున ఇప్పటికైనా పూర్ణ పరిశీలించి తుర్కయంజాలను నాలుగు వార్డులుగా విభజించి అందరికీ సమన్యాయం చేయవలసిందిగా కోరుతున్నాము లేనిపక్షంలో అఖిలపక్ష ఆధ్వర్యంలో అన్ని పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేసి సాధించుకుంటామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్ నాయక్, కందాడ లక్ష్మారెడ్డి, కాకుమాను చెన్నయ్య, సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మేతరి అశోక్,బిందు రంగారెడ్డి, తాళ్లపల్లి మోహన్ గుప్తా, కోంద్రు మల్లేష్, సామ సంజీవరెడ్డి, బొక్క గౌతమ్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రొక్కం ప్రభాకర్ రెడ్డి, చక్కరగు, తుమ్మలపల్లి వెంకటరెడ్డి, నరేందర్, నర్ర పాండు, తదితరులు పాల్గొన్నారు

## నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్‌కు తావులేదు : ఏసిపి వెంకట్ రెడ్డి



**నేరెడ్ మేట్, డిసెంబర్ 29,ప్రభాతవార్త :**
రాబోయే నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డ్రగ్స్ వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి సోమవారం నేరెడ్ మేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పబ్‌లు, హౌస్ పార్టీల వేదికలు, యాంటీ రూమ్‌లు, బారాక్స్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కుషాయిగూడ ఎ సి పి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పబ్‌ల యాజమాన్యాలకు స్పష్టమైన సూచనలు చేసినట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు పూర్తిగా డ్రగ్స్ రహితంగా నిర్వహించాలని, ఎలాంటి మత్తు పదార్థాలకు అవకాశం ఇవ్వకూడదని ఆదేశించారు. అలాగే వాహనాల పార్కింగ్ విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మైనర్లకు మద్యం సరఫరా జరిగితే కఠినంగా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.డ్రగ్స్‌కు సంబంధించిన చిన్నపాటి సమాచారం వచ్చినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని, వేడుకల సమయంలో అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై యాజమాన్యాలు నిఘా ఉంచాలని ఏసీపీ సూచించారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయి పర్యవేక్షణ కొనసాగిస్తుందని తెలిపారు.ఈ తనిఖీల్లో నేరెడ్ మేట్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ తో పాటు ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణంలో నిధుల గోల్‌మాల్

### రూ.40 లక్షల నిధులు స్వాహా చేశారని ఆరోపించిన బిజెపి బృందం



టాయిలెట్ల పేరిట పాత భవనానికే డోర్లు, కిటికీలు ఏర్పాటు చేసి నిధులు స్వాహా చేశారని ఆరోపిస్తున్న బిజెపి నేతలు రామకృష్ణారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు



బిజెపి బృందం పరిశీలనలో పాఠశాలలో కనిపించిన దుర్భర టాయిలెట్ల దృశ్యం

**సరూర్‌నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రస్తుత జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కిందకు వచ్చిన పాత బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణంలో నిధుల గోల్‌మాల్ జరిగిందని బిజెపి నాయకులు ఆరోపించారు. సోమవారం బడంగ్‌పేట్ సర్కిల్ క్లస్టర్-1 బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, రావుల మల్లేష్, గుండె నాగార్జున బాబు, సంపత్‌రెడ్డి, రామిడి శేఖర్‌రెడ్డి, క్యారగారి అరవింద్, రామాచారి, జి.మల్లేష్‌లతో కూడిన బృందం పాఠశాలను సందర్శించి అక్కడి టాయిలెట్ల సమస్యలను పరిశీలించి విద్యార్థినిలతో మాట్లాడి వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం వారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని టాయిలెట్ల నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించారు. ఈ సందర్భంగా రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నూతన టాయిలెట్ల నిర్మాణం కోసం గత బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం రూ.40 లక్షల అంచనా వ్యయంతో తీర్మాణం చేసిందని ఎజెండా కాపీలను చూపించారు. అయితే గతంలో ఉన్న పాతభవనానికే కిటికీలు, డోర్లు, టాయిలెట్ కుండీలు ఏర్పాటు చేసి రూ.40 లక్షల నిధులను కాంట్రాక్టర్ దామోదర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు స్వాహా చేశారని వారు ఆరోపించారు. ప్రస్తుతం పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు చాలా ఘోరమైన స్థితిలో ఉన్నాయనీ అపరిశుభ్రం, తీవ్ర దుర్వాసన నెలకొందనీ అందులో నీటి సదుపాయం కూడా లేదని బయట బీరు బాటిళ్లు దర్శనమిస్తున్నాయని వారు వెల్లడించారు. టాయిలెట్లకు వెళ్ళలేని స్థితిలో బాలికలు అవస్థలు పడుతున్నారని వారు విచారం వ్యక్తం చేశారు. బాలాపూర్ పాఠశాలకు 2025వ సంవత్సరంలో పాత బడంగ్‌పేట్ కార్పొరేషన్ రూపాయి కూడా ఖర్చు చేయలేదని వారు వెల్లడించారు. పాఠశాలకు కేటాయించిన నిధుల దుర్వినియోగం చేసిన కాంట్రాక్టర్ పాత భవనాన్ని కొత్తదిగా చూపించే ప్రయత్నం చేశాడని వారు ఆరోపించారు. కాంట్రాక్టర్ వెనుక ఎవరు ఉన్నారో? విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాలాపూర్‌కు చెందిన వారికే మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు కట్టబెట్టినా బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పరిస్థితులు మారలేదని వారు విమర్శించారు. పిఎం శ్రీ నిధి యోజన కింద కేంద్ర ప్రభుత్వం బాలాపూర్ పాఠశాలకు మంజూరు చేసినరూ.10.50 లక్షల నిధుల ఖర్చుపై కూడా ప్రధానోపాధ్యాయుడు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వారు ఆరోపించారు. నిధుల వినియోగంపై పొంతన లేని సమాధానాలు చెబుతున్న ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల టాయిలెట్ల సమస్యలు పరిష్కారం కాకుండా బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు.

## బడంగ్‌పేట్ సర్కిల్లో పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి: డిసి త్రిల్లేశ్వర్‌రావు



బడంగ్‌పేట్ సర్కిల్‌లో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్‌రావు

**సరూర్‌నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్‌లో పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ కమీషనర్ (డిసి) టిఎస్‌విఎన్ త్రిల్లేశ్వర్ రావు కోరారు. శంషాబాద్ జోనల్ కమీషనర్ ఆదేశాల మేరకు బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలోని ఆరు డివిజన్లలో సోమవారం బడంగ్‌పేట్ డిసి ఆధ్వర్యంలో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాదర్‌గుల్ డివిజన్-57లోని మున్సిపల్ ఆఫీస్ నుండి ప్రభుత్వ పాఠశాల వరకు, ప్రశాంతిహిల్స్ డివిజన్-58లోని ప్రశాంతిహిల్స్ నుండి అల్మాస్‌గూడ కమాన్ వరకు అదే విధంగా బడంగ్‌పేట్ కమాన్ నుండి బాలాపూర్ కరెంట్ ఆఫీస్ వరకు, జిల్లెలగూడ డివిజన్-59లోని జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం చౌరస్తా నుండి చల్లా లింగారెడ్డి జడ్పీ స్కూల్ వరకు అదే విధంగా గాయత్రీనగర్ మెయిన్ రోడ్డు, గాయత్రీనగర్ చౌరస్తా లైబ్రరీ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు, మీర్‌పేట్ డివిజన్-60 లోని త్రివేణినగర్ మెయిన్‌రోడ్డు, మీర్‌పేట్ మెయిన్ రోడ్డు, తిరుమలహిల్స్, సర్వోదయనగర్ కాలనీ నుండి సాయిబాబా టెంపుల్ వరకు, బడంగ్‌పేట్ డివిజన్-61లోని బడంగ్‌పేట్ మెయిన్ రోడ్డు, బాలాపూర్ డివిజన్-62లోని శివాజీ చౌక్ నుండి నక్షత్ర కాలనీ బాలాపూర్ వరకు పారిశుధ్య సిబ్బంది రహదారులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డిసి త్రిల్లేశ్వర్‌రావు ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించారు. బడంగ్‌పేట్ సర్కిల్‌లో స్వచ్ఛతను కాపాడడానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ సంరెడ్డి నాగేందర్‌రెడ్డి, డిఇఇలు పి.వెంకన్న, వేణుగోపాల్, ఎఇఇ హరీష్, సానిటీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, మేనేజర్ జి.శ్రీధర్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సానిటేషన్ జవాన్లు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి : డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ



ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ, చిత్రంలో ఏఎంహెచ్ఓ రుద్ర భాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ సంజయ్ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**
ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మలక్ పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ ఇంకేషాఫ్ అలీ పేర్కొన్నారు. మలక్ పేట బిబ్లాక్స్ లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సయ్యద్ షాబుద్ధిన్, ఎంఎంహెచ్ఓ రుద్ర భాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ సంజయ్,యుసిడి బిపిఓ లక్ష్మి బాయి, ఇఇ సునీల్ కుమార్,ఎఇ శ్రీనివాస్, దుర్గా రావు పాల్గొన్నారు.

## విజయవంతమైన ఓనస్ రోబోకాన్ 3.0



రోబోకాన్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**సైదాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** ఓనస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓనస్ రోబోకాన్ 3.0 విజయవంతమైంది. డాక్టర్ బాలరాజు నాయుడు, డాక్టర్ కార్తీక్, డాక్టర్ మధుసూధన్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అరుణ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌ను ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ ఛైర్మన్ రామా నాయుడు ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 300కు పైగా ప్రతినిధులు ఈ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సల్లో తాజా పురోగతి, ఆధునిక సాంకేతిక వైద్య విధానాలు, భవిష్యత్తులో చోటు చేసుకునే మార్పుల గురించి కాన్ఫరెన్స్‌లో చర్చించారు. నిపుణుల ప్యానెల్ చర్చలు, లైవ్ రోబోటిక్ సర్జరీల ప్రత్యక్ష ప్రదర్శనలు, సీనియర్ సర్జన్ల శాస్త్రీయ ప్రజంటేషన్స్ కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రోబోటిక్ మోకాలి మార్పిడి, రోబోటిక్ హిప్ మార్పిడిల శస్త్ర చికిత్సల్లో వచ్చిన నూతన సాంకేతిక వైద్య విధానాల గురించి నిపుణులు వివరించారు.

## జీతం కోసం అసెంబ్లీకి వచ్చారా?

### -ప్రతిపక్ష నేత కెసిఆర్‌ను ప్రశ్నించిన దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త:**
శాసనసభకు వచ్చిన ప్రతి పక్ష నేత కెసిఆర్ కేవలం రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోవడం సరికాదని జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనకుండా కేవలం సంతకం చేసి వెళ్లిపోవడంలోని ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. కేవలం జీతం కోసం అసెంబ్లీకి వచ్చారా? అని కెసిఆర్‌ను రాజశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇకనైనా కెసిఆర్ తన వైఖరిని మార్చుకుని శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొని ప్రతి పక్ష నాయకుడిగా తన వంతు బాధ్యతను నెరవేర్చాలని రాజశేఖర్‌రెడ్డి కోరారు.

## షెడ్డు నిర్మాణానికి రూ.25 వేల విరాళం



చెక్కు అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** కొత్తపేటలోని శ్రీప్రసన్న మహంకాళి అమ్మవారి ఆలయంలో షెడ్డు నిర్మాణం కోసం రూ.25 విరాళం అందజేసినట్లు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని శ్రీప్రసన్న మహంకాళి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో దాదాపు 300 గజాల స్థలంలో శాశ్వత షెడ్డు నిర్మాణానికి అవసరమైన రూ.25వేల చెక్కును సోమవారం చిలుక ఉపేందర్ రెడ్డి అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కొత్తపేట అధ్యక్షులు మాదూరి వాసు గుప్తా, కార్యవర్గ సభ్యులు జగిని రమేష్, ఆర్యవైశ్య సంఘం ఆర్కేపురం అధ్యక్షులు ఉప్పల బాలశ్యామ్, వీరలింగం, ఆర్వేపల్లి శ్రీనివాస్, చీకోటి కరుణాకర్, రేణిగుంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డిప్యూటీ కమషనర్ శైలజని కలిసిన జక్క వెంకట్ రెడ్డి



**బోడుప్పల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త;**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ. శైలజని, సర్కిల్ కార్యాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ, మేడిపల్లి పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సమయం కేటాయించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ సానుకూలంగా స్పందిస్తూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మేడిపల్లి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మాధుసూదన్ రెడ్డి, , మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, మల్లం వెంకటేష్ గౌడ్, యాసారం శ్రీనివాస్, పాశం నరేందర్ రెడ్డి, బుల్లెట్ శంకర్, కోనేటి వెంకట్, అమర్ పటేల్, కిరణ్ నాయక్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్థంగా ఉప్పల్ డివిజన్ విభజన : బిఆర్ఎస్



ఉప్పల్ డివిజన్ విభజనపై ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నేతలు

**ఉప్పల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి ప్రక్షాళనలో భాగంగా ఉప్పల్ సర్కిల్‌లో డివిజన్ల విభజన అశాస్త్రియంగా ఉందని పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు ఆరోపించారు.సోమవారం ప్రజావాణిలో మున్సిపల్ ఇంజనీర్ హరిలాల్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం సర్కిల్ పరిధిలో అన్ని డివిజన్లను చిన్నగా మార్చారని, కాని ఉప్పల్ డివిజన్ విభజనలో నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. ఒక్కో డివిజన్‌లో సుమారు 45 నుంచి 50వేల ఓటర్లు ఉండగా, ఉప్పల్ డివిజన్‌లో సుమారు 70వేల ఓటర్లు ఉండే విధంగా ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఒకే డివిజన్‌లో అధికశాతం మంది ఓటర్లు ఉంటే ప్రజలకు ఎలా సేవలు అందిస్తారని వారు ప్రశ్నించారు. అధికారులు మరోసారి పరిశీలించి డివిజన్‌లోని అన్ని ప్రాంతాలు కలిపే విధంగా డివిజన్ విభజన చేయాలని, దీనిపై తాము ఆందోళనకు సిద్ధం అవుతామని తెలిపారు. ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## రూ.110 కోట్లతో చిలుకానగర్ అభివృద్ధి : బన్నాల గీత



చిలుకానగర్ వార్డు కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశమైన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో రూ.110 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చిలుకానగర్ వార్డు కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజల సహకారంతో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన వారికి తగు గుర్తింపు ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ ఎన్నికలకు ప్రతి ఒక్కరు సిద్దంగా ఉండాలని సూచించారు. పార్టీ ఎవరికి అవకాశం ఇచ్చినా కలిసికట్టుగా పనిచేస్తామని ఆమె తెలిపారు. తిరిగి మరోసారి బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## యువత వ్యాపారం వైపు అడుగులు వేయాలి : మంత్రి వివేక్ వెంకటస్వామి



మంత్రి వివేక్ వెంకట స్వామికి స్వాగతం పలుకుతున్న జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ , మాజీ మేయర్ అజయ్ యాదవ్ ,మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ,బొమ్మక్ నిఖిల్ ,మాజీ కార్పొరేటర్లు, తదితరులు

**బోడుప్పల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త ;**
జీహెచ్ఎంసీ బోడుప్పల్ సర్కిల్ లో ఏర్పాటు చేసిన కుబేర ఫిల్లింగ్ స్టేషన్‌ను తెలంగాణ రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ,మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ , ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విధంగా ఫిల్లింగ్ స్టేషన్ నిర్వహణ ఉండాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ,ఫీర్జాదిగూడ కార్పొరేషన్ మాజీ మేయర్ అమర్ సింగ్ , బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి ,మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ డీప్యూటి మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ , బిఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి , చెంగిచెర్ల మాజీ ఉప సర్పంచ్ కొత్త రవి గౌడ్ , ఫిల్లింగ్ స్టేషన్ నిర్వహకులు మాజీ కార్పొరేటర్ బొమ్మకు కళ్యాణ్ కుమార్, బొమ్మక్ నిఖిల్, మాజీ వార్డు సభ్యులు బోమ్మక్ రమేష్ ,మాజీ సహకార బ్యాంక్ డైరెక్టర్ బోమ్మక్ విశ్వనాథ్ ,మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోమ్మక్ అజయ్ ,మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, భూక్యా సుమన్ నాయక్, గుర్రాల వెంకటేష్ యాదవ్, నాయకులు విశ్వం గుప్త, పడుతం లోకేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అండగా ఉంటాం



కార్యక్రమంలో పాల్గొన్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, దేవ భాస్కర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను త్వరలోనే అందజేసేలా కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రామకృష్ణపురం డివిజన్, సరూర్‌నగర్ డివిజన్ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులు సోమవారం వారిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మంకల్, సర్దార్‌నగర్‌లో ప్రభుత్వం తమకు కేటాయించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పట్టాలు ఉన్నప్పటికీ, ఇంకా గృహ ప్రవేశం కల్పించలేదని వారు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అండగా ఉంటామని అన్నారు. ఇళ్ల పట్టాలు పొందిన ప్రతి లబ్ధిదారునికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయ కులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, తలాటి రమే ష్‌నేత, పగడాల ఎల్లయ్య, దుబ్బాక శేఖర్, దాక్యర్‌నాయక్, షఫీ పటేల్, శేఖర్‌ముదిరాజ్ అక్బర్, నబీ, జగన్నాథం, శేషు, శేఖర్, ప్రసాద్, అశోక్, మల్లయ్య, రవి, మరియమ్మ, గీతాంజలి, మమత, మణెమ్మ, పల్లె సంగీత, కంచర్ల యాదమ్మ, జయమ్మ, పద్మ, సంతోష్, అనిత, ఎస్.కె. జారియా, అస్మా పాల్గొన్నారు.